DATE: 24-03-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

గురువారం 24 మార్చి, 2022



# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
సంపుటి(Volume) : 2 పేజీలు - 08
సంచిక(Issue) : 263 వెల: రూ 5/-
prajamantalu.com

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



మీకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు
బడులు, గుడులు కట్టించి ఊరు రుణం తీర్చుకోండి 5లో



రాష్ట్రాల సీఎంలను సమావేశ పర్చండి
ధాన్యం సేకరణపై జాతీయ స్థాయిలో ఒకే విధానం ఉండా 2లో

## సికింద్రాబాద్ బోయిగూడాలో
# ఘోర అగ్నిప్రమాదం

- మంటలు అంటుకుని 11మంది సజీవ దహనం
- గుర్తు పట్టలేనంతగా కాలిన మృతదేహాలు
- రంగంలోకి దిగి మంటలను ఆర్పిన ఫైరింజన్లు
- వెంటనే సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు
- బోయిగూడ అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు 2లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్
- మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పున పరిహారం



హైదరాబాద్,మార్చి23: సికింద్రాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది.. బోయిగూడలోని ఓ స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది కార్మికులు సజీవదహనం అయ్యారు.. బుధవారం తెల్లవారుజామున స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది.. అందులో పనిచేస్తున్న కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు.. ఇద్దరు కార్మికులను ఫైర్ సిబ్బంది కాపాడారు.. ఇక, స్క్రాప్ గోదాం పక్కనే టింబర్ డిపోలు ఉన్నాయి.. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన ఎనిమిది ఫైర్ ఇంజన్లు.. మంటలను అదుపుచేశాయి.. కానీ, అప్పటికే 11 మంది కార్మికులు సజీవదహనం అయ్యారు.. ఈ ఘటనలో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్టు తెలుస్తోంది. మృతులంతా బీహార్‌కు చెందిన కార్మికులుగా సమాచారం అందుతోంది.. ఇదో ప్లాస్టిక్ గోదాం కావడంతో ఇక్కడ ఎలాంటి రక్షణ చర్యలు లేవని ఆరోపణలు ఉన్నాయి.. షార్ట్ సర్క్యూట్ కారణంగా స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగి.. గోదాం మొత్తం

- మిగతా 2లో

## 60 కి.మీ లోపు ఒక్కటే
# టోల్ ప్లాజా

మిగిలినవి మూసేయిస్తాం
కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ,మార్చి23: టోల్ ప్లాజాకు 60 కిలోమీటర్ల లోపు ఉండే ఇతర అన్ని టోల్ ప్లాజాలను మూడు నెలల్లో మూసివేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. 2022-23కి గాను రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు నిధుల డిమాండ్‌పై సమాధానమిస్తూ లోక్‌సభలో ఈ మేరకు ప్రకటించారు. నిబంధనల ప్రకారం జాతీయ రహదారులపై 60 కిలోమీటర్ల లోపు రెండు టోల్ గేట్లు ఉండకూడదని అన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని టోల్ బూత్‌లు పని చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి అక్రమ టోల్ పాయింట్లను త్వరలో మూసివేస్తామని గడ్కరీ హామీ ఇచ్చారు. 'జరుగుతున్నది తప్పు. ఇది చట్టవిరుద్ధం. రాబోయే మూడు నెలల్లో 60 కిలోమీటర్ల లోపు ఒకే ఒక్క టోల్ కలెక్షన్ పాయింట్ ఉంటుంది. రెండవది ఉంటే మేం దానిని మూసివేస్తామని నేను హామీ ఇస్తున్నా. ఎందుకంటే

- మిగతా 2లో

## తెలంగాణ ప్రజలకు
# విద్యుత్ షాక్



- ఏప్రిల్ 1నుంచి భారీగా పెరగనున్న ఛార్జీలు
- ఛార్జీలు పెంచుకునేందుకు ఈఆర్సీ అనుమతి
- యూనిట్‌కు 40నుంచి 50 పైసల వరకు పెరిగే ఛాన్స్
- ప్రజలపై భారీగా పడనున్న విద్యుత్ ఛార్జీల భారం

హైదరాబాద్,మార్చి23 : తెలంగాణలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఈఆర్సీ అనుమతించడంతో ధరలు పెరగనున్నాయి. 14 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ టీఎస్ఈఆర్సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే 19 శాతం పెంపునకు డిస్కంలు అనుమతి కోరాయి. డొమెస్టిక్ మీద 40 పైసల నుంచి 50 పైసలు పెంచనున్నారు. ఇతర కేటగిరీలపై యూనిట్‌కు రూపాయి చొప్పున పెరుగనుంది.

- మిగతా 2లో

# పండిన మొత్తం ధాన్యం కొనలేం

- ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యం కొనలేమన్న పీయూష్ గోయల్
- ఉత్పత్తి, డిమాండ్, అవసరాల మేరకే సేకరణ ఉంటుందని వెల్లడి
- తెలంగాణ బియ్యం ఎగుమతులకు కేంద్రం అనుమతి
- నేడు టీఆర్ఎస్ మంత్రుల బృందానికి అపాయింట్‌మెంట్



న్యూఢిల్లీ,మార్చి23: తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతికి అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ఎగుమతిదారులు సైతం తెలంగాణ నుంచి పెద్దఎత్తున బియ్యాన్ని ఎగుమతులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతేడాది కూడా తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులు జరిగాయని ఆయన తెలిపారు. అయితే తెలంగాణలో ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నకు నేరుగా స్పందించేందుకు గోయల్ నిరాకరించారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఉత్పత్తి అయిన ధాన్యం, బియ్యం మొత్తాన్ని కొనలేమని పార్లమెంట్‌లో తెగేసి చెప్పింది. కేవలం ఆయా రాష్ట్రాల్లో

- మిగతా 2లో



ఆత్మనిర్భర భారత్‌లో
## కీలక మైలురాయి

400 బిలియన్ డాలర్ల
ఎగుమతుల లక్ష్యాన్ని సాధించాం

అందుకు కృషి చేసిన వారిని
అభినందించిన మోడీ

న్యూఢిల్లీ,మార్చి23:'ఆత్మనిర్భర్ భారత్' ప్రస్థానంలో అత్యంత కీలక మైలురాయిని భారత దేశం దాటిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. 400 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని సాధించిన నేపథ్యంలో అందరినీ అభినందించారు. ఇటువంటి లక్ష్యాన్ని సాధించడం ఇదే తొలిసారి అని ట్విటర్ వేదికగా తెలిపారు. 2022 మార్చి 31నాటికి 400 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేయాలని 'ఆత్మనిర్భర్ భారత్' పథకంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే తొమ్మిది రోజులు మిగిలి ఉండగానే ఈ లక్ష్యాన్ని సాధించారు. 400 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేయాలని భారత దేశం అత్యంత ఆకర్షణీయమైన లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని మొట్టమొదటిసారి సాధించింది. ఈ విజయానికి కారకులైన మన రైతులు, చేనేతకారులు, ఓ÷ూఓఇబ, తయారీదారులు, ఎగుమతిదారులను నేను అభినందిస్తున్నాను. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' ప్రస్థానంలో చాలా ముఖ్యమైన మైలురాయి అని

- మిగతా 2లో

## మొదటి విడత షురూ..

- 30,453 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు
- శాఖల వారీగా నియామకాలకు అనుమతిస్తూ జీవో జారీ



హైదరాబాద్,మార్చి23(ఆర్ఎన్ఎ: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 30,453 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం శాఖల వారీగా ఉద్యోగ నియామకాలకు అనుమతిస్తూ జీవోలు విడుదల చేసింది. మొత్తం 80,039 పోస్టులకు గాను.. తొలి విడుతగా 30,453 పోస్టుల భర్తీకి ఇవాళ ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

- మిగతా 2లో

వైభవంగా ధర్మపురీశుల
# రథోత్సవ వేడుకలు



(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి మార్చ్ 23 (ప్రజా మంటలు) :సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ధర్మపురి దేవస్థానంలో 13 రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనరసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం నుండి రాత్రి వరకు వైభవోపేతంగా జరిగాయి. దేవస్థానం ఎస్.ఈ ఓ శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామయ్య, సభ్యుల ఆధ్వర్యంలో, రథోత్సవం సందర్భంగా దేవస్థాన వంశపారంపర్య పౌరోహితులు కందాళై పురుషోత్తమాచార్య, యాజ్ఞకులు ఆస్థాన వేద పండితులు రమేశ్ శర్మ ఆచార్యత్వంలో మధ్యాహ్నం 3 గంటలకు ముందుగా వేద మంత్రాలతో, మంగళవాద్యాలతో దేవస్థానం ముందుభాగాన, సర్వాం గసుందరంగా అలంకరించి ఉంచిన మూడు రథాలపై శ్రీలక్ష్మీనరసింహ, శ్రీవేంకటే శ్వర, శ్రీరామలింగేశ్వర స్వాములను ఆసీనుల గావించి బలిహరణం, అష్టదిక్పాలకుల పూజ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను దేవస్థాన పౌరోహితులు కందాళై పురుషోత్తమాచార్య, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశశర్మ పర్యవేక్షణలో అర్చకులు, వేదపండితులు నిర్వహించారు.

- మిగతా 2లో

## ప్రజానాడి




## ధర్మపురిలో భక్తులకు సౌకర్యాల కల్పన భేష్
సంక్షేమ శాఖల మంత్రి ఈశ్వర్



ధర్మపురి క్షేత్రంలో 13 రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ శ్రీ వెంకటేశ్వర వార్షిక బ్రహ్మోత్సవాలలో అంతర్భాగమైన రథోత్సవ ప్రధాన ఘట్టం అత్యంత వైభవోపేతంగా జరిగిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు బుధవారం రాత్రి రథోత్సవ వేడుకలలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ పుట్ట బంగారం కార్యక్రమంతో ప్రారంభమై కళ్యాణం తెప్పోత్సవం దినోత్సవం రథోత్సవ లకు ఇతర రాష్ట్రాల

- మిగతా 2లో

## ఉత్తరాఖండ్ సీఎంగా పుష్కర్‌సింగ్ ధామి ప్రమాణం

- ప్రమాణం చేయించిన గవర్నర్ గుర్మీత్ సింగ్
- హాజరైన ప్రధాని మోడీ, అమిత్‌షా, నడ్డా



డెహ్రాడూన్,మార్చి23: ఉత్తరాఖండ్ 12వ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ప్రమాణం చేశారు. డెహ్రాడూన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ధామీతో లెఫ్టినెంట్ గవర్నర్ గుర్మీత్ సింగ్ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమోంమతం÷-రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు నడ్డా తదితరులు హాజరయ్యారు. ప్రమాణస్వీకారం

- మిగతా 2లో

## 60 కి.మీ లోపు ఒక్కటే టోల్ ప్లాజా

మొదటిపేజీ తరువాయి..

మరోవైపు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయం మంగళవారం పోస్ట్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో 60 కిలోమీటర్ల లోపు ఎక్కువ సంఖ్యలో ఉన్న టోల్ గేట్ల గురించి నెటిజన్లు ప్రస్తావించారు. జాతీయ రహదారి 66పై తాలపాడు, కుందాపుర మధ్య 90 కిలోమీటర్ల లోపు మూడు టోల్ ఎ÷-లాజాలు ఉన్నాయని ఒకరు పేర్కొన్నారు. అలాగే నగరాలకు సమీపంలోని టోల్ గేట్లు చాలా తక్కువ దూరంలోనే ఉంటున్నాయని, ఆయా ప్రాంతంలోని నివాసితులు అన్ని టోల్ ఎ÷-లాజాల నుంచి పాసులను పొందాల్సి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరొకరు వెల్లడించారు.

## సికింద్రాబాద్ బోయిగూడాలో ఘోర అగ్నిప్రమాదం



మొదటిపేజీ తరువాయి..

వ్యాపించాయి.. స్క్రాప్ దుకాణంలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ కాలి, మందు బాటిళ్ల సామాన్లు ఉండడంతో మంటలు వ్యాపించాయి.. కార్మికులు నిద్రలోనే ప్రాణాలు కోల్పోయినట్టుగా చెబుతున్నారు.. మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి గాంధీ నగర్ పోలీసులు తరలించారు. మంటల ధాటికి మృతదేహాలు గుర్తు పట్టనంతగా ముద్దగా మారాయి. బుధవారం ఉదయం 4 గంటల సమయంలో బోయిగూడలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్రమంగా అవి మొత్తానికి వ్యాపించడంతో పెద్ద ఎత్తున్న అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అదుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదు ÷ర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేశారు. మంటల ధాటికి గోడౌన్ పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో పదకొండు మంది అక్కడికక్కడే మరణించారని అధికారులు చెప్పారు. వీరిలో కొందరు సజీవదహనమవగా, మరికొందరు ఊపిరాడక చనిపోయారన్నారు. మరొకరు క్షేమంగా బయటపడ్డారని వెల్లడించారు. ప్రమాద సమయంలో టింబర్ డిపోలో 12 మంది ఉన్నారని చెప్పారు. మృతులంతా బీహార్‌కు చెందిన వలస కార్మికులని తెలిపారు. మృతులను సికిందర్ (40), బిట్టు (23), సత్యేందర్ (35), గోలు (28), దామోదర్ (27), రాజేశ్ (25), దినేశ్ (35), రాజేశ్ (25), చింటు (27), దీపక్ (26), పంకజ్ (26)గా గుర్తించారు. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో టింబర్ డిపో, స్క్రాప్ గోదాం ఉన్నాయని పోలీసులు చెప్పారు. టింబర్ డిపో నుంచి స్క్రాప్ గోదాముకు మంటలు వ్యాపించాయన్నారు. పొగ దట్టంగా కమ్ముకోవడంతో మృతదేహాలను వెలికితీయడానికి ఇబ్బందయిందని తెలిపారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున సీఎం పరిహారం ప్రకటించారు. మృతదేహాలను బీహార్‌కు పంపించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. అగ్ని ప్రమాద ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. స్క్రాప్ గోదాములో జరిగిన ఈ ప్రమాదంలో 11 మంది వలస కూలీలు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించారు. ప్రధాని మోదీ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో, బోయిగూడ స్క్రాప్ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. ఈ సొమ్మును ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి చెల్లించనున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదంలో మృతదేహాలు అన్ని పూర్తిగా కాలిపోయాయని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన మృత దేహాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. ఇలాంటి ఘటనలో పొగతోనే ముందుగా మరణిస్తారని, పొగ వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్తారన్నారు. మృతదేహాలను గుర్తించిన అనంతరం పోస్ట్ మార్టం నిర్వహిస్తామని డాక్టర్ రాజారావు తెలిపారు.

## పండిన మొత్తం ధాన్యం కొనలేం

మొదటిపేజీ తరువాయి..

ఉత్పత్తుల ఆధారంగా కొనుగోళ్లు చేయలేమని తెలిపింది. అదనంగా ఉన్న ఉత్పత్తులు, రేటు, డిమాండ్. సరఫరా పరిస్థితుల ఆధారంగానే కొనుగోళ్లు జరుగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ మంత్రి గోయల్ సమాధానం ఇచ్చారు. ఉత్పత్తి ఆధారంగా ధాన్యం, బియ్యం సేకరణ చేయడం సాధ్యం కాదని పార్లమెంట్ కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. లోకసభలో ఎంపీలు సుమలత, మనీష్ తివారి, రాజ్ దీప్ రాయ్, మనోజ్ సహా పలువురు సభ్యులు ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రులు పీయూష్ గోయల్, ఆ శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ధాన్యం సేకరణకు అనేక అంశాలు ముడిపడి ఉంటాయని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. కనీస మద్దతు ధర, డిమాండ్, సరఫరా, మార్కెట్‌లో ఉన్న ధరలు, ఇతర పరిస్థితుల ఆధారంగానే సేకరణ జరుగుతుందని కేంద్రం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఎఫ్‌సీఐ.. గోధుమ, వరి ధాన్యాలను నిర్దిష్ట పరిధి, నాణ్యతతో సేకరిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో కనీస మద్దతు ధరకు ముడి ధాన్యం సేకరణ జరుగుతుందని కేంద్రం పేర్కొంది. ఎఫ్‌సీఐతో చర్చించి ప్రణాళిక ప్రకారం ధాన్యం సేకరణ పక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది. సేకరించిన ధాన్యాన్ని జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం రాష్ట్రాలకు తిరిగి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపింది.తెలంగాణలో ఉత్పత్తి అయిన ధాన్యం, బియ్యం మొత్తాన్ని కొనలేమన్నారు. అదనంగా ఉన్న ఉత్పత్తుల డిమాండ్, సరఫరా ఆధారంగానే కొనుగోలు ఉంటాయని స్పష్టం చేశారు. అస్సాంలో ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నకు లోక్ సభ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ధాన్యం సేకరణ కేవలం ఉత్పత్తి పైనే ఆధారపడి ఉండదు. మద్దతు ధర, డిమాండ్ , సప్లై లాంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టత ఇచ్చారు. వరి ధాన్యం కోనుగోలుపై కేంద్రంపై తెలంగాణ సీఎం కేసీఆర్ సీరియస్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు వడ్ల కొనుగోలు అంశంపై గురువారం తెలంగాణ మంత్రులకు పీయూష్ గోయల్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. పార్లమెంట్‌లోని రాజ్యసభ లాబీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కలిశారు. రాజ్యసభ సభ్యులు కే కేశవరావు నేతృత్వంలో కలిసిన ఎంపీలు.. ధాన్యం సేకరణ అంశంపై పీయూష్ గోయల్ వద్ద ప్రస్తావించారు. ఈ అంశంపై మీతో చర్చించేందుకు నలుగురు మంత్రులు ఢిల్లీ వచ్చారని గోయల్‌కు ఎంపీలు వివరించారు. మంత్రులకు, ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గోయల్‌ను కేశవరావు కోరారు. రేపు షెడ్యూల్ చూసుకుని సమయం ఇచ్చేందుకు పరిశీలిస్తానని పీయూష్ గోయల్ కేకేకు తెలిపారు. వన్ నేషన్ వన్ ప్రొక్యూర్‌మెంట్ నినాదంతో, పంజాబ్‌లో మాదిరిగా తెలంగాణలోనూ మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర మంత్రుల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. ఢిల్లీ వెళ్లిన ఈ బృందంలో నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ ఉన్నారు. మంత్రులు, ఎంపీలు ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేయనున్నారు.

## మొదటి విడత షురూ..

మొదటిపేజీ తరువాయి..

ఈ మేరకు అనుమతులిస్తూ జీవోలు జారీ చేసింది. గ్రూప్-1, హోంశాఖ, జైళ్లు, రవాణాశాఖలు, వైద్య, ఆరోగ్యశాల్లోని పోస్టులతో పాటు, ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు సైతం ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సంబంధిత శాఖల్లో భర్తీ ప్రక్రియను నియాకమక సంస్థలు చేపట్టనున్నాయి. ఇతర శాఖల్లోని ఖాళీలపై త్వరలోనే ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, ఆయా శాఖల మంత్రులు, ఆయా శాఖ అధికారులు, ఆర్థిక శాఖ అధికారులతో చర్చించి, మిగతా ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతులు జారీ చేయనున్నది. ఇటీవల శాసన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసందే. దీనిపై ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, ఆర్థిక శాఖ అధికారులు సమీక్షించి వీలైనంత ఉద్యోగాలకు అనమతులు ఇవ్వాలని సీఎం కేసీఆర్ శాసన సభలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆర్థిక మంత్రి హరీష్ రావు, ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర మంత్రులతో పాటు సీఎస్ సోమేశ్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆయా శాఖల అధికారులతో పలు దఫాలుగా చర్చించారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖకు ప్రభుత్వం అనుమతిచ్చింది. టెట్ అర్హతల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) ఆదేశాల మేరకు టెట్ పేపర్ -2కు బీఈడీ అభ్యర్థులు కూడా అర్హులేనని జీవో జారీ చేసింది. దీంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధించే ఎస్జీటీ ఉద్యోగాలకు బీఈడీ అభ్యర్థులకు అర్హత రానుంది. అయితే, ఉద్యోగంలో చేరిన రెండేళ్లలోపు ప్రాథమిక విద్యలో 6 నెలల బ్రిడ్జి కోర్సు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎన్‌సీటీఈ మార్గదర్శకాల మేరకు టెట్ అర్హత కాలపరిమితిని ఏడేళ్ల నుంచి జీవితకాలానికి సవరించింది. రాష్ట్రంలో 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయ నియామకాలకు వీలుగా ముందుగా మే నెలలో టెట్ నిర్వహించాలని విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో సుమారు 3లక్షల మంది అభ్యర్థులు టెట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పాఠశాల విద్యాశాఖ టెట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

### ఆత్మనిర్భర భారత్లో
## కీలక మైలురాయి

మొదటిపేజీ తరువాయి..

మోదీ ట్వీట్ చేశారు. నిర్దేశిరచుకున్న గడువుకు తొమ్మిది రోజుల ముందుగానే ఈ లక్ష్యాన్ని సాధించామని చెప్తూ ఓ గ్రాఫిక్‌ను కూడా ఆయన పోస్ట్ చేశారు. ÷ూష్ట్రాలు, జిల్లాల స్థాయుల్లో ప్రభుత్వం సంపూర్ణంగా, సన్నిహితంగా వ్యవహరించడం వల్ల ఈ లక్ష్యాన్ని సాధించగలిగినట్లు తెలిపారు. అదేవిధంగా ఎగుమతుల ప్రోత్సాహక మండళ్ళు, పారిశ్రామిక సంఘాలు, సంబంధిత ఇతరులతో క్రియాశీలక సంబంధాలను నెరపడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం కూడా దీనికి దోహదపడినట్లు చెప్పారు.

## ఉత్తరాఖండ్ సీఎంగా పుష్కర్‌సింగ్ ధామి ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

అనంతరం పుష్కర్ ధామీ ప్రధాని ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎం ప్రమాణస్వీకారం అనంతరం మంత్రులుగా సత్పాల్‌తో పాటు ధన్‌సింగ్ రావత్, గణెశీశ్ జోషి, రేఖా ఆర్య, సుబోధ్ ఉనియాల్, సౌరవ్ బహుగుణ, ప్రేమ్‌చంద్ అగర్వాల్, చందన్ రామ్



దాస్‌లు సైతం మంత్రులుగా ప్రమాణం చేశారు. పుష్కర్ సింగ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం ఇది రెండోసారి కావడం విశేషం. మొన్నటి ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైనప్పటికీ తిరిగి ఆయనకు అధికార పగ్గాలను బిజెపి కట్టబెట్టింది. ఇంతకు ముందు జూలై 2021లో తీరత్ సింగ్ రాజీనామా తర్వాత బీజేపీ అధిష్టానం ధామికి బాధ్యతలు అప్పగించింది. సోమవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి మీనాక్షి లేఖి సమక్షంలో బీజేపీఎల్పీ నేతగా ధామిని ఎన్నుకున్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖతిమా అసెంబ్లీ స్థానం నుంచి ఓటమిపాలైన విషయం తెలిసిందే. అయినా, అధిష్ఠానం ఆయనపై నమ్మకంతో సీఎం బాధ్యతలు అప్పగించింది. ప్రమాణ స్వీకారం అనంతరం ధామీ మాట్లాడుతూ గురువారం తొలి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇవాల్టి నుంచే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తామన్నారు. రాబోయే దశాబ్దం ఉత్తరాఖండ్‌దేనన్నారు.

## తెలంగాణ ప్రజలకు విద్యుత్ షాక్

మొదటిపేజీ తరువాయి..

దీంతో వినియోగదారులపై భారీగా భారం పడనుంది. ఇప్పటికే ధరల పెరుగుదలపై విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అయినా ప్రభుత్వం ధరల పెంపునకే మొగ్గు చూపింది. ఎండాకాలంలో విద్యుత్ రేట్లు షాక్ ఇవ్వబోతున్నాయి. ఈఆర్సీ అనుమతించడంతో తెలంగాణలో విద్యుత్ ఛార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిస్కంల వినతి మేరకు కరెంటు ఛార్జీలను పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 14 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ తెలంగాణ ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. డొమెస్టిక్ మీటర్లపై యూనిట్ కు 40 నుంచి 50 పైసల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే ఇతర కేటగిరీలపై యూనిట్‌కు రూపాయి చొప్పున పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాగా.. రాష్ట్రంలో 19 శాతం మేర విద్యుత్ ఛార్జీల పెంపునకు అనుమతి కోరగా.. 14 శాతం మాత్రమే విద్యుత్ ఛార్జీలను పెంచుతూ తెలంగాణ ఈఆర్ఎసీ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ సీఎం కేసీఆర్ చార్జీల పెంపు కే మొగ్గు చూపితే రాష్ట్రంలో ఏప్రిల్ ఒకటి నుంచి కరెంటు ఛార్జీలు భారీగా పెరగనున్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అయితే వ్యవసాయం,సెలూన్లకు పెంపు వర్తించబోదని స్పష్టం చేసింది. ఈ మేరకు మీడియా సమావేశంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) ఛైర్మన్ టి.శ్రీరంగారావు వెల్లడించారు. డిస్కమ్‌లు ఐదేళ్ల విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలు కమిషన్ ముందుంచాయని, దీనిపై వినియోగదారుల అభిప్రాయాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుందని ఈఆర్సీ ఛైర్మన్ తెలిపారు. 2022-23 ఏడాదికి డిస్కమ్‌లు ప్రతిపాదించిన రెవెన్యూ గ్యాప్ రూ.16వేల కోట్లని చెప్పారు. కానీ, రూ.14,237 కోట్ల రెవెన్యూ గ్యాప్‌ను కమిషన్ ఆమోదించిందని వివరించారు.వ్యవసాయానికి విద్యుత్ టారిఫ్ పెంచలేదు. ఈవీ ఛార్జింగ్‌కు టారిఫ్ ప్రతిపాదనలు ఆమోదించలేదు. డిస్కమ్‌లు నవంబర్ 30లోపు ప్రతిపాదనలు కమిషన్ ముందు ఉంచాలని శ్రీరంగారావు అన్నారు. ఆసక్తిగలవారు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు చేసుకోవచ్చని ఈఆర్సీ ఛైర్మన్ తెలిపారు. జీడిమెట్ల స్మార్ట్ గ్రిడ్ పూర్తిస్థాయిలో విస్తరించాలని అధికారులకు సూచించారు. ద్రవ్యలోటు రూ.6,338 కోట్లుగా డిస్కమ్‌ల ప్రతిపాదించాయని... రూ.5,596 కోట్లకు కమిషన్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

## రాష్ట్రాల సీఎంలను సమావేశ పర్చండి

### ధాన్యం సేకరణపై జాతీయ స్థాయిలో ఒకే విధానం ఉండాలి
### తదనుగునంగా ప్రణాళిక రూపొందించండి
### యాసంగి పంట మొత్తం ధాన్యం కొనాల్సిందే
### ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేసే బాధ్యత కేంద్రానిదే
### ప్రధానికి సీఎం కేసీఆర్ లేఖ



హైదరాబాద్,మార్చి23 ధాన్యం సేకరణపై ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు లేఖ రాశారు. యాసంగిలో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీఎం కేసీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. పంజాబ్, హర్యానాలో మాదిరిగానే తెలంగాణలో కూడా ధాన్యాన్ని సేకరించాలని సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారు. ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేసే బాధ్యత కేంద్రానిదే అని సీఎం కేసీఆర్ మరోసారి గుర్తు చేశారు. ఆహార భద్రతా చట్టం ప్రకారం ఆహార ధాన్యాల సేకరణ.. వాటి భద్రత కూడా కేంద్రానిదే అని సీఎం కేసీఆర్ కేంద్రానికి పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వ్యవసాయ నిపుణులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ ఈ లేఖలో సూచించారు. రైతు పండించిన మొత్తం ధాన్యాన్ని సేకరించకపోతే.. కనీస మద్దతు ధరకు ఏం అర్థముంటుందని కేసీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.ఆహార భద్రతా లక్ష్యానికి కూడా తూట్లు పొడిచినట్లే అవుతుందని సీఎం తేల్చి చెప్పారు. దేశ మంతా ఒకే రకమైన ధాన్య సేకరణ విధానం ఉండాలని, కేంద్ర ప్రభుత్వం పండిన ధాన్యాన్ని గనక పూర్తిగా సేకరించకపోతే సాగు రంగంపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కేసీఆర్ హెచ్చరించారు. అయితే.. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠమైన చర్యల వల్ల రాష్ట్రంలో ధాన్యం దిగుబడి బాగా పెరిగిందని, వ్యవసాయం సుస్థిరపడిందన్నారు. పంటల వైవిధ్యత కోసమే తమ ప్రభుత్వం ఇతర పంటలను కూడా ప్రోత్సహిస్తోందని కేసీఆర్ కేంద్రానికి క్లారిటీ ఇచ్చారు. రబీ సీజన్‌లో 52 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయించామని, ఎలాంటి ఆంక్షలు లేకుండా వరిని కొనుగోలు చేయాలని సీఎం కేసీఆర్ ప్రధాని మోడీని కోరారు.

## గిరిజన శాఖ మంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న గిరిజనం

### రిజ్వేషన్ల బిల్లు చేరలేదని బుకాయిస్తున్నారని మండిపాటు
### సూర్యాపేటలో నల్లబ్యాడ్జీలతో భారీ నిరసన

సూర్యాపేట,మార్చి23:
జనాభా ప్రాతిపదికన గిరిజన రిజర్వేషన్ బిల్లును తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన బిల్లు తమ వద్దకు చేరలేదని కేంద్ర గిరిజనశాఖ సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యల పట్ల సూర్యాపేట గిరిజన లోకం భగ్గుమంటుంది.. కేంద్రం తీరును నిరసిస్తూ గిరిజనులు నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ ఆఫీసు ముట్టడికి యత్నించారు. టీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో గిరిజనులు కాలినడకన బీజేపీ ఆఫీసు ముట్టడికి బయల్దేరారు. ఆఫీసు వద్ద గిరిజనులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. బీజేపీ ఆఫీసు ముందు ఆ పార్టీ యువ మోర్చా నాయకులు హంగామా చేశారు. కర్రలతో భయభ్రాంతులకు గురి చేశారు. గిరిజన నాయకులను, మహిళలను అసభ్య పదజాలంతో దూషించారు. గిరిజనులపై కర్రలతో దాడి చేసేందుకు యత్నించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను బీజేపీ నాయకులు ఎక్కి హల్‌చల్ చేశారు. జిల్లా కేంద్రంలో నల్లా జెండాలు ప్రదర్శించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎస్ఆర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నేతలు మాట్లాడుతూ.. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం పంపలేదని తప్పుడు వ్యాఖ్యలు చేసిన బిశ్వేశ్వర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచాలని 2017లోనే తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర హోంశాఖకు పంపిందన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గిరిజన సోదరులకు తెలుసన్నారు. బిల్లు తమ వద్దకు చేరిందని కేంద్ర హోంశాఖ కూడా అక్నాలెడ్జ్ చేసిందన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ కూడా గిరిజనుల రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన అంశం కేంద్రం పరిశీలనలో ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్పుడేమో అసలు అలాంటి ప్రతిపాదనేదీ తమ వద్దకు రానేలేదని పార్లమెంట్‌లో దారుణంగా అబద్ధలాడటం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులను అవమానించడమే అని మండిపడ్డారు. గిరిజనుల తో పెట్టుకున్న ఏ కేంద్ర ప్రభుత్వం బతికి బట్టకట్టలేదన్న నేతలు.. దేశ వ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న గిరిజన లోకాన్ని ఏకం చేసి కేంద్రం పై పోరు బాట చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సూర్యాపేట నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన గిరిజనులతో పాటు నేతలు ఎంపీపీ కుమారి బాబు, లచ్చి రాం నాయక్, సర్పంచ్ లు బికారు, అనీల్, నాగు నాయక్, బిక్షం నాయక్, కౌన్సిలర్ లింగా నాయక్, వాంకుడోతు వెంకన్న, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

## బీర్భూమ్ హంతకులను వదలరాదు

### మమతా బెనర్జీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న ప్రధాని

న్యూఢిల్లీ,మార్చి23: పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి హేయమైన నేరానికి పాల్పడిన వారిని మమతా బెనర్జీ సారథ్యంలోని బెంగాల్ ప్రభుత్వం చట్టానికి పట్టి ఇస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం బీర్భూమ్ గ్రామంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ఎనిమిది మంది సజీవదహనమయ్యారు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో పాల్గొన్న అమరులకు నివాళిగా బుధవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన ' భారత్ గ్యాలరీ'ని మోదీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీర్భూమ్ సామూహిక హత్యలకు పాల్పడిన నేరస్థులను, అలాంటి నేర శక్తులను ప్రోత్సహిస్తున్న వారిని ఎప్పటికీ క్షమించరాదని బెంగాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేరస్థులను సాధ్యమైనంత త్వరలో పట్టుకుని శిక్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి అన్నివిధాలా సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు.

### దేశానికి ఆదర్శంగా కెసిఆర్ విధానాలు

సూర్యాపేట,మార్చి23(ఆర్‌ఎన్ఎ: బీజేపీ పాలనలో దేశంలో తిరోగమనం చెందుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. దేశానికి అవసరమైన ఒక్క మంచి పని కూడా కేంద్రం చేయడం లేదన్నారు. బిజెపిని పారదోలితేనే దేశానికి విముక్తి అన్నారు. సూర్యాపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుతమైన అభివృద్ధిని సాధించి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణలో సాగుతున్న సుభిక్షమైన పాలనను దేశ ప్రజలంతా కోరుకుంటు న్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను, టీఆర్ఎస్ కేవలం తెలంగాణకే పరిమితం చేయాలని బీజేపీ ఎన్నో కుట్రలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే రాష్ట్రంపై కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక రకాల మోసాలకు, ద్రోహాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇవాళ పంజాబ్‌ను మించి అత్యధిక వరిని తెలంగాణ పండిస్తుందని, వడ్లను కొనకుండా ఇబ్బందిపెడుతుందన్నారు. సాకులు చూపి తెలంగాణ రైతులను నట్టేట ముంచేలా కేంద్రం వ్యవహరిస్తోందని, తెలంగాణ రైతుల పక్షాన టీఆర్ఎస్ ఎంతకైనా కొట్లాడుతుందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీజేపీ మోసాలను ఎండగట్టాలని, నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ మీటింగ్‌లు పెట్టి రైతులను సంఘటితం చేసి.. బీజేపీ దుష్ట పాలనను వివక్షను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా సీఎం కేసీఆర్ నాయకత్వం లో కేంద్రంపై పోరాటం చేస్తామని, వడ్లు కొనేదాక కేంద్రాన్ని విడిచిపెట్టమని హెచ్చరించారు. బీజేపీ పార్టీ దేశానికే ప్రమాదకరంగా మారిందని, ముఖ్యంగా రైతుల పాలిట శనిలా దాపురించిందన్నారు.



## లలిత మాత ఆలయములో సహస్రనామ పారాయణం

**జగిత్యాల రూరల్ మార్చి 23 (ప్రజామంటలు):** స్థానిక పొలాస శివారు ప్రాంతంలోని సహస్ర లింగాల దేవాలయం సమీపంలో అద్భుతంగా నిర్మాణం జరుగుతున్న లలితా మాత దేవాలయం లో ఈరోజు 9 సార్లు మణి ద్విప వర్ణన, లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. జగిత్యాల పట్టణానికి చెందిన అనేకమంది భక్తులు ఈ కార్య క్రమం లో పాల్గొని పారాయణం శ్రద్ధగా చేశారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత వాసవి పౌరాణిక బి రుదాంకితులు బెంగుళూరుకు చెందిన వేమా సుబ్రహ్మణ్యం గుప్త లలితా మాత వైభవం గురించి ప్రసంగించారు. అనంతరం 9 రకాల ప్రసాదాలు పంపిణి చేసారు. ఈనాటి కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చెల్లమ్ స్వరూప, సత్తయ్య, పామ్ పట్టి రవీందర్, తవుటు రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు



**తరిగొప్పుల మార్చి 23 (ప్రజామంటలు):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు (బుధవారం) రోజున స్వయం పరిపాలన దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని తమ తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెట్టుగారి ఐలయ్య మాట్లాడుతూ.... విద్యార్థులు మీరు నీతిగా, నిజాయితీగా, సత్ప్రవర్తన కలిగి, పట్టుదలతో సన్మార్గంలో పయనించి, ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని, బాలల భవిష్యత్తులోనే దేశ భవితవ్యం ఆధారపడి ఉందని తెలిపారు. ఈ వేడుకలో జనగామ జిల్లా విద్యాశాఖాధికారిగా మద్దెబోయిన ప్రణీత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా జెల్ల హారిక, ఫిజికల్ డైరెక్టర్లుగా మ్యాక కార్తీక్, సభావత్ సాయి కుమార్ వ్యవహరించారు. నేటి విద్యార్థి ఉపాధ్యాయులలో ప్రథమ బహుమతి ఆవుల వైష్ణవి, ద్వితీయ బహుమతి ముడావత్ కళ్యాణి, తృతీయ బహుమతి ఆవుల సింధుజ, కన్సోలేషన్ బహుమతి జంగా వినయ్ లుగా నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ ఆవుల రజితసంపత్, ఉపాధ్యాయులు బానోతు రవీందర్, గాదె జోసెఫ్ బేబి, ఇర్రి క్రిష్ణారెడ్డి, మచ్చ చీరంజీవులు, కట్ల యాదగిరి, మహ్మద్ యూసుఫ్ పాషా, చిదురాల శ్రీనివాస్, కొండం రజని, సంగరబోయిన పద్మజా, జీడి కంటి నర్సయ్య, ప్రజ్ఞాపురం ప్రవీణ్ కుమార్, అడెపు శ్రీనివాస్, కందకట్ల నీరజా, అన్వర్ సుల్తాన, కొండపర్తి కళావతి తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన మంజులా రెడ్డి



**హుస్నాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లంబజార్ వార్డ్ కి చెందిన సూదుమల్ల వెంకటేష్ ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారన్న విషయం యువసేన సభ్యులు తెలుపగా బుధవారం సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ . వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. వీరి వెంట మంజులక్క యువసేన సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.?

## జమియతుల్ హుఫ్ఫాజ్ సేవలు అభినందనీయం



**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** జమియత్ ఉల్ హుఫ్ఫాజ్ సేవలు అభినందనీయమని కరీంనగర్ జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో మంజుల అన్నారు. జమియతుల్ హుఫ్ఫాజ్ ఆధ్వర్యంలో మాతా శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇంజనీర్ కోల అన్నారెడ్డి తో కలిసి ఆర్ఎంవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వేసవిని పురస్కరించుకొని మాతా శిశు ఆసుపత్రిలో ప్రసూతి కోసం వచ్చే పేషెంట్లకు, వారి బంధువులకు కుల, మతలకతీతంగా, మానవ సేవే ప్రామాణికంగా ఉచితంగా చల్లని త్రాగునీరు అందించడం చాలా పుణ్య ప్రదమైన విషయమన్నారు. సేవా గుణానికి చిరునామాగా బాటసారులకు, ప్రయాణికులకు జమియతుల్ హుఫ్ఫాజ్ సేవలు అందించడం హర్షణీయమన్నారు. మౌలానా సయ్యద్ అహ్మద్, ముయేజ్ నద్వీ దుఆ చేశారు. ఈ కార్యక్రమంలో జమియతుల్ ఉలేమా జిల్లా ముఫ్తీ మహమ్మద్ యూనిస్ ఖాస్మి, ముఫ్తీ సాదిక్ హుస్సేన్ ఖాస్మీ, జమియతుల్ హుఫ్ఫాజ్ ఉపాధ్యక్షుడు హాఫీజ్ జియావుల్లా ఖాన్, కార్యదర్శి హాఫీజ్ ముహమ్మద్ వసీమ్‌ఉద్దీన్, కోశాధికారి హాఫీజ్ మొజ్జామ్ హుస్సేన్, హాఫీజ్ రిజ్వాన్, హాఫీజ్ ఫరీదోద్దీన్ అమ్జద్, హాఫీజ్ ఇస్మాయిల్ రషీద్, హాఫీజ్ జకీర్ జలీల్ పాల్గొన్నారు.



జగిఃత్యాల జిల్లా కేంద్రం లోని భగిని నివేదిత బాలికల ఆవాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్ దంపతులు

# మార్చి 31 లోగా ఈ-కుబీర్ లోని పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

### ప్రతినెల ఒకటిన జీతాలు చెల్లించాలి



**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** ఈ కుబీర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులన్నింటిని మార్చి 31 లోగా మంజూరు చేయాలని, ప్రతి నెల ఒకటిన ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని జగిత్యాల జిల్లా కేంద్రంలోని యూఎస్పీఎస్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా ట్రెజరీ కార్యాలయం ముందు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి.) ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనర్ల -పెండింగ్ బకాయిల మంజూరి కొరకు నిరసన-ప్రదర్శన నిర్వహించడమైనది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసి) పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలో భాగంగా జగిత్యాల డిటివో ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా యూఎస్పీసి స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ. ఉద్యోగ, ఉపాధ్యాయుల మరియు పెన్షనర్ల వేతనాలు ప్రతి నెల ఒకటవ తేదీ నుండి 12వ తేదీ వరకు దశలవారీగా, ఒక్కోరోజు కొన్ని జిల్లాల చొప్పున విడుదల చేస్తూ, వేతనం కొరకు ప్రతి నెల ఎదురుచూడాల్సిన దుస్థితి మన బంగారు తెలంగాణ రాష్ట్రంలో నేడు ఉందని,ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ బకాయిల కొరకు నెలల తరబడి వేచిచూడాల్సి వస్తోందని, వేతన జీవులు ప్రతి నెల వారి వేతనం నుంచి జిపిఎఫ్ లో జమ చేసుకుంటున్నటువంటి సొమ్ములు అత్యవసరాల కొరకు సకాలంలో అందక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్మెంట్, తదితర బిల్లుల చెల్లింపులు నెలల తరబడి జాప్యం జరుగుతున్న నేపథ్యంలో యూఎస్పీసి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి మరియు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రికి ప్రాతినిధ్యం చేసినప్పటికీ బిల్లులు మంజూరు కావడం లేదని, ఈ నేపథ్యంలో యూఎస్పీసి ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన చేపట్టడం జరుగుతుందని, ఇప్పటికైనా ఆర్థికశాఖ మేల్కొని ఈ ఆర్థిక సంవత్సరం (31 మార్చి)ముగిసే లోగా పెండింగ్ బిల్లులు అన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమైనది. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 2022) నుండి అయినా ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చేయాలని డిమాండ్ చేయడమైనది. ఈ నిరసన అనంతరం జగిత్యాల జిల్లా డిటివో మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసి నాయకులు అడ్డగట్ల గంగాధర్, తిరు కోవెల శ్యామ్ సుందర్, బోగ రమేష్, ఎన్నం రామ్ రెడ్డి, నకుమల్ల నరసయ్య, అంబటి భూమేశ్వర్, కొక్కుల రాంచంద్రం, ఎ.నరేందర్, గోవర్ధన్, శ్రీనివాస్, జయంత్, మహేష్ , ప్రసాద్, గంగయ్య, శ్రీధర్, ఫక్రోద్దీన్, ఇంతియాజ్, సుధాకర్, శ్రీనివాస్, విజయ్ కుమార్, చంద్రమౌళి, రామ్ కుమార్, రాజేష్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి

- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కా. తమ్మినేని వీరభద్రం




**జనగామ మార్చి 23 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం రూ 2, 56, 958 లక్షల కోట్ల బడ్జెట్ లో మూడు ఎకరాల భూమి పంపిణీ, పట్టణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పన కోసం ఒక్క పైసా కేటాయించక పోవడం రాష్ట్రంలో సెంటు భూమిలేని 3.50 లక్షల దళిత కుటుంబాలతో పాటు, పట్టణ పేదలను టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేయ్యడమేనని, ఇంటి జాగాలు లేని వారికి ప్రభుత్వమే స్థలాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ 5 లక్షలు ఇవ్వాలని సిపిఎం తెలంగాణరాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జనగామ పట్టణ కేంద్రంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జనగామ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ....అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆర్భాటంగా ప్రకటించిన ఖాళీ పోస్టుల భర్తీ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీలను దాచిపెట్టిందని, వాస్తవానికి ఖాళీలు మూడు లక్షల పైగా ఉన్నాయని , పి.ఆర్.సి కమిటీ అధికారికంగా 1, 91, 126 పోస్టులు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వంకు రిపోర్ట్ ఇస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి 91, 143 మాత్రమే ఖాళీలు ఉన్నట్లు ప్రకటించడం ఆందోళకరం అన్నారు. ఈ పోస్టుల భర్తీకి కావాలిసిన నిధులు బడ్జెట్ లో ఒక్క పైసా కేటాయించక పోవడం చూస్తే అనేక అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీపై నోరు విప్పలేదన్నారు. పోడు సాగుదారులకు హక్కు పత్రాలిస్తామని, కొత్త రేషన్ కార్డులు, కొత్త పించన్లు కోసం తీసుకున్న అప్లికేషన్లపై ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం అట్టడుగు వర్గాల ప్రజలను నిలువునా మోసం చెయ్యడమేనని విమర్శించారు. డబల్ బెడ్రూమ్ ఇండ్లకు, ఇంటిస్థలం ఉన్నవాళ్లకు మూడు లక్షల నగదు ఇస్తాం అంటూనే బడ్జెట్లో రూ 12 వేల కోట్లు కేటాయించడం చూస్తే డబల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణంను తుంగలో తొక్కినట్లే అన్నారు. ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి 5 లక్షల నగదు సాయం చేయ్యాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డులు కోసం, 57 ఏండ్ల లోపు ఉన్న వారు పించన్ల కోసం దరకాస్తులు మీసేవలో చేసిన వారు లక్షల్లో ఉన్నారని వారి గురుంచి మాట్లాడకపోవడం కేసీఆర్ మోసం తేటతెల్లం అవుతుందని, తక్షణం అర్హులకు రేషన్ కార్డులు, పించన్లు మంజూరు చెయ్యాలి అని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వమే ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. డబల్ బెడ్రూమ్ పేరుతో ఇండ్ల స్థలాల పంపిణి ఆపే విధానం సరికాదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ మాట్లాడుతూ ధరణి పోర్టర్ లో మార్పులు తెచ్చి పేదలు అనుభవంలో ఉన్న పోడు, బంజరు, ఇనాం, అసైన్డ్ మెంట్, చెరువు శిఖం, భూదాన, దేవాదాయ, కాందిశీకుల భూములకు పట్టాలివ్వాలని, రైతు బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, రాపర్తి సోమన్న, గొల్లపల్లి బాపురెడ్డి, సాంబరాజు యాదగిరి, బిట్ల శేఖర్, బూడిది గోపి, పి. ఉపేందర్, ఎ. కుమార్, బోడ నరేందర్, బి. వెంకటేష్, సోమన్న, ఎం.డి సభానా, ఎం.డి. అజారోద్దిన్,ప్రకాష్, ఎం. రమేష్, కె. యాకయ్య పాల్గొన్నారు.

## అనుమతికి విరుద్ధముగా ఉన్న నిర్మాణములు ముందే గుర్తించండి

### మున్సిపల్ చేర్ పర్సన్ డా.బోగ శ్రావణి



జగిత్యాల మార్చ్ 23 (ప్రజామంటలు): టీ ఎస్బి పాస్ పై ప్రజలకు సరియైన అవగాహన లేక నిర్మాణాలు చేయడముతో సంబంధిత అధికారులు నిబంధన లు పాటించక నిర్మాణాలను ఇటీవల తొలిగించిన నేపథ్యంలో నిర్మాణ యజమానులకు ఇబ్బంది కలుగకుండా ముందస్తుగా టీ ఎస్ బి పాస్ పై అవగాహన కలిగించి నిబంధన లకు విరుద్ధం గా ఉన్న నిర్మాణ తొలి దశలోనే గుర్తించాలని దీంతో నిర్మాణ యజమానులు సైతం నష్ట పోకుండా ఉండడానికి బుధవారం వార్డు అధికారులకు నిర్వహించిన సమావేశం లో చైర్ పర్సన్ దిశ నిర్దేశం చేశారు. ఇందుకు గాను మున్సిపల్ కార్యాలయం యందు వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించిన మున్సిపల్ చేర్పర్సన్ డా. బోగ శ్రావణి ప్రవీణ్. ఈ సందర్భముగా చేర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణములో వార్డులలో నిర్మించే నిర్మాణములను ముందు దశలోనే గుర్తించాలని, పట్టణ ప్రజలకు టి.యస్.బి. పాస్ పై అవగాహన కల్పించాలని ముఖ్యముగా అనుమతి లేకుండా మరియు అనుమతికి విరుద్ధముగా నిర్మించే నిర్మాణములపై జగిత్యాల ఆర్.డి.ఓ. కన్వీనర్ గా వ్యవహరించే డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్ ద్వారా ఎటువంటి నోటీస్ లేకుండానే తొలగిస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని దిశ నిర్దేశం చేశారు. అలాగే పట్టణ ప్రజలు అందరూ టి.యస్ బి.పాస్ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని అలాగే స్థలములు కొనుగోలు చేసే ముందు కూడా నిబంధనల ప్రకారము కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో కమీషనర్ స్వరూప రాణి, వార్డు అధికారులు పాల్గొన్నారు. ఇట్టి సమావేశము యందు మున్సిపల్ కమిషనర్ జి. స్వరూప రాణి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతు కుటుంబాలకు అండగా పాడి రైతు భరోసా పథకం

### కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు



సైదాపూర్ (ప్రజామంటలు): పాడి రైతు కుటుంబాలకు అండగా పాడి రైతు భరోసా పథకం నిలుస్తుందని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరు బిసియు పరిధిలోని ఆకునూరు, జాగిరిపల్లి, బొమ్మకల్, రాయికల్, ఎడపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో మృతి చెందిన పాడి రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 వేల చొప్పున 8మంది పాడిరైతులకు నాలుగు లక్షల రూపాయల చెక్కులను చైర్మన్ రాజేశ్వర్ రావు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... పాడి రైతు భరోసా పథకంలో పాడి రైతు 2 వందలు కరీంనగర్ డైరీ 2 వందలు చెల్లిస్తే పాడి రైతు భార్యాభర్తల్లో ఎవ్వరూ మరణించిన వారికి ఈ పథకం అమలు అవుతుందని తెలిపారు. దహన సంస్కారాలకు ఐదువేల రూపాయలను అందిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ డెయిరీ పరిధిలో 135మందికి చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్ రావు, భగవంతరావు, వెంకట్ రెడ్డి, మారుపాక రాజు, జమ్మికుంట అసిస్టెంట్ మేనేజర్ రాజేందర్, ఆకునూరు బీసీయు ఇన్చార్జ్ తిరుపతి, సూపర్వైజర్లు తోంట ప్రకాష్ పలు గ్రామాల డేయిరీ అధ్యక్షులు బొజ్జ రవీందర్, ఈదులకంటి మహేందర్ రెడ్డి, కేతిరి శ్రీనివాస రెడ్డి, తీగల పద్మనాభం, సురేందర్ రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం సరైంది కాదు



**కరీంనగర్ మార్చి 23( ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో ఎనర్జీ రెగ్యులేషన్ కమిషన్ విద్యుత్ చార్జీలు పెంపునకు ఈఆర్సీ డిస్కమ్లకు అనుమతులు ఇవ్వడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి మిలుకురి వాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే అనేక ఇబ్బందులతో సతమతమవుతున్న సామాన్య పేద మధ్యతరగతి ప్రజానీకానికి విద్యుత్ చార్జీల పెంపు పిడుగుపాటు లాంటి అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటాయి,పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్ ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఈనేపథ్యంలో డొమెస్టిక్ 50పైసలు ఇతర కేటగిరీలకు యూనిట్ కు రూపాయి చొప్పున పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దుర్మార్గమైన చర్య గా అభివర్ణించారు. ఈఆర్సి 14 శాతం విద్యుత్ ఛార్జీలు పెంచుకునేందుకు అనుమతిని ఇవ్వడం అవివేకమన్నారు. ఈఆర్సి బహిరంగ విచారణలో అఖిలపక్ష పార్టీలు, ప్రజలు విద్యుత్ చార్జీలు పెంచవద్దని విజ్ఞప్తులు చేసినప్పటికీ ఈఆర్సి పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే డెవలప్మెంట్ ఫీజు పేరుతో వినియోగదారులపై కోట్ల రూపాయల భారం వేశారని మళ్లీ విద్యుత్ ఛార్జీలు పెంచడం అంటే పెనం నుండి ప్రజలను పొయ్యి లో పడేయడం అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.

## యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి



**హుస్నాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాటం చేసి నునుగు మీసాల యుక్త వయస్సులో ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడి దేశం కోసం అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని కోరారు. దేశంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని జేరిపోతుల జనార్ధన్ అన్నారు. భగత్ సింగ్ 91 వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. సుజిత్ కుమార్, నాయకులు వంశీ, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన భగీరథ పైప్ లైన్ వృథాగా పోతున్న నీరు



**కోరుట్ల టౌన్ మార్చి 23 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీరు వృధాగా పోతుంటే అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇంటింటికీ నల్లా నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పైప్ లైన్లకు కొన్నిచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయని స్థానికులు వాపోతున్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రకాశం రోడ్ లో గల కేశవ పిల్లల హాస్పిటల్ ముందు గల మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతుంది. తరచు పైప్ లైన్ నీరు లీక్ అవ్వడం అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతం హాస్పిటల్ వచ్చే బాలింతలు, ఇతర చిన్న వ్యాపారస్తులు, వివిధ దుకాణాలు, ఆటోలు ఆగటం నిత్యం వచ్చిపోయే వారితో బిజీగా ఉంటుంది. వెంటనే అధికారులు మరమత్తులు చేయక పోవటంతో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో హాస్పిటల్ కి, దారిలో వెళ్ళే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటు వాపోతున్నారు. వృధాగా పోతున్న నీరును చూస్తూ ఉండడమే తప్ప, చేసేది ఏమీ లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, లీకేజీ అయిన పైపు లైన్ ను మరమ్మతులు చేసి, ప్రజలకు నీటి సరఫరా అందేలా చొరవ చూపాలని కాలని వాసులు కోరుతున్నారు.

## రెవెన్యూ మేళాను వినియోగించుకొండి



**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యలయము యందు ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళా ను ప్రతీ ఆదివారం మరియు బుధవారం వినియోగించుకోవాలని మున్సిపల్ స్వరూప రాణి తెలిపారు. బుధవారం రెవెన్యూ మేళా యందు 4 దరఖాస్తులు స్వీకరించడం జరిగినదని వాటిని సత్వరమే పరిష్కరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణ ప్రజలు ఇంటి పన్ను బకాయిలు సకాలములో చెల్లించాలని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## స్వచ్ఛత మనందరి బాధ్యత కరపత్ర ఆవిష్కరణ



**రాయికల్ మార్చి 23 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణ కేంద్రానికి చెందిన మెప్మా ఆర్పి జయసుధ గోపాల్ రెడ్డి దంపతులు రూపొందించిన స్వచ్ఛత మనందరి బాధ్యత కరపత్రాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మరియు మున్సిపల్ కమిషనర్ సంతోష్. చైర్మన్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను ఒక బాధ్యతగా స్వీకరించాలని స్వచ్ఛ రాయికల్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ మాట్లాడుతూ.... స్వచ్ఛత మనందరి బాధ్యత అని దీనికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులై ఉండాలని స్వచ్ఛ సర్వేక్షన్ 2022 లో రాయికల్ మున్సిపల్ ను తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ధర్మపురి,మేనేజర్ వెంకటి, మెప్మా ఆర్పిలు, మెప్మా సీఈవో మహేష్, కంప్యూటర్ మేనేజర్ రాకేష్ రావ్, కరపత్ర ప్రచురణకర్త మెడినోవా హాస్పిటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల దుబారాతోనే పెట్రో ధరల పెరుగుదల!

ఇప్పుడు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచే పనిలో పడింది. వరుసగా రెండోరోజూ ధరలను పెంచేసింది. ఇక కాచుకోండి. అచ్చేదిన్ పోయాయన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు రూ.100కుపైగా పెరుగగా సబ్సిడీ గ్యాస్ ధర మరోసారి రూ.50 పెంచేయడంతో ప్రస్తుతం రూ.1002కి చేరింది. ఇలా వంటగ్యాస్ ధర తరచూ పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆందోళన పరుస్తున్నాయి. ఈ పెరుగుదలతో ఇక వంటింట్లోకి వెళ్లాలంటే గృహిణులు భయపడే పరిస్థితులు దాపు రించాయి. గ్యాస్ పేలుతుందో ఏమో అని మహిళలు కలవరిస్తున్నారు.
ఇంటి భయంకర పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. నిజానికి ధరలు తగ్గించడమెలా..ఖర్చులు తగ్గించుకోవడమెలా అన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. తమ ఖర్చులను పైసా కూడా తగ్గించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డ పాలకులు ఉన్నంతకాలం గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం భవిష్యత్ ఆలోచన లేని పాలకులు ప్రజలకు గుదిబండగా మారారు. ప్రజల నుంచి వసూలుల చేసిన పన్నులతో విలాసాలు చేస్తున్నారు. దర్పంగా కాలం వెళ్లదీస్తున్నారు. ముందుగా పాలకులు పెడుతున్న ఖర్చులపై చర్చ చేయాలి. పార్లమెంటులో ధరలపై చర్చించాలి. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి. సబ్సిడీ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో ప్రజలపై మరోసారి వంట గ్యాస్ ధర భారంగా మారింది. సామాన్యులపై ఇది మోయ లేని భారంగా మారింది. దీనికితోడు ఇప్పుడు సబ్సిడీ మొత్తంగా తగ్గించేశారు.
రోజురోజుకూ నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల పేదప్రజలను బతకలేని స్తితికి చేర్చింది. ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో ఇప్పటికే వంటనూనెల ధరలు అమాంతంగా పెరిగాయి. ఇదే కారణంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో చమురు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. మంగళవారంతో మొదలైన ధరల దాడి బుధవారం కూడా సాగింది. చమురు దిగుమతులు తగ్గడంతో పాటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం తో ఆ భారం సామాన్యుడిపై పడుతోంది.
అయితే గతంలో క్రూడ్ ధరలు తగ్గినా ఇక్కడ పెట్రోల్,డీజిల్ ధరలు మాత్రం తగ్గించలేదు. మోడీ ఏ ముహూర్తానా అడుగు పెట్టాడో కానీ పెట్రో ధరల పెరుగుదలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. పెరిగిన పెట్రోల్ ధరలు, గ్యాస్ ధరల కారణంగా ఒక్కో కుటుంబంపై నెలకు కనీసం 200 నుంచి 500 భారం పడనుంది. సామాన్యుల జీవితాలను గమనంలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నెలల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోంది. దీంతో వంట చేసుకునేందుకు కట్టెల పొయ్యే దిక్కని ప్రజలు వాపోతున్నారు. గ్యాస్ కొనాలంటేనే భయమేస్తోందంటున్నారు. ఇకపోతే గతంలోలాగా కాకుండా సబ్సిడీని తీసివేయడంతో కొనే పరిస్థితి లేకుండా పోయింది.
దీనికి తోడు రవాణా చార్జీల పేరిట గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లు అదనపు డబ్బులు వసూలు చేస్తుండడంతో ప్రస్తుతం సామాన్యుడు ఒక సిలిండర్‌కు రూ.1020 నుంచి 1050 వరకు చెల్లించాల్సి వస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న ధరలు అదనపు వసూళ్లతో వంట గ్యాస్ సిలిండర్ సామాన్యులు మోయలేనంత బరువెక్కుతోంది. నెలలో వ్యవధిలోనే భారీగా పెంచడం తట్టుకోలేక పోతున్నారు. గత సంవత్సరం నుంచి సిలిండర్ ధరలను భారీగా పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. ప్రతీసారి గ్యాస్ ధర పెంపుపై
సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. ఇలా నెలల వ్యవధిలో వంటగ్యాస్ ధరను పెంచడం మంచిది కాదని పాలకులు గుర్తించడం లేదు. గ్యాస్ సిలిండర్ వద్దనే దుస్థితికి ప్రజలను దిగజార్చడమే ప్రభుత్వ లక్ష్యమా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు 5 కిలో మీటర్ల పరిధిలో ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కిలో మీటర్ల లోపు రూ.10లు, అంతకు ధర పెంచినప్పుడల్లా రవాణా చార్జీలు రూ.5 నుంచి పది వరకు పెంచుకుంటూ పోతున్నారు. కొన్ని ఏజెన్సీలు డోర్ డెలివరీ చేయలేమని తమ వద్దకే వచ్చి తీసుకెళ్లాలని షరతులు పెడుతున్నారు. దీంతో వినియోగదారులు అవసరం కొద్ది అదనంగా సొమ్ము చెల్లించి గ్యాస్ తెచ్చుకో వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో సిలిండర్‌ను డెలవరీ చేయాలంటే డెలవరీ బాయ్ సిలిండర్‌కు రూ.20 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం ఎల్‌పీజీ గ్యాస్ ధర రూ.1002 డెలివరి బాయ్ చార్జీలు కలుపుకుంటే రూ.1050కి చేరుతోంది. ఇలా గ్యాస్ ధరలు పెరగడంతో వినియోగించలేని పరిస్థితి ఎదురవుతుందని వినియోగదారులు వాపోతున్నారు.



గ్రామీణ ప్రాంతాల్లో వంట చెరుకు వినియోగాన్ని తగ్గించేందుకు దీపం పథకం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజనలో సబ్సిడీపై గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చారు. అడవుల రక్షణ, మహిళల అనారోగ్యం దృష్ట్యా ఈ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. పెద్ద మొత్తంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు కనెక్షన్‌లు తీసుకున్నాక ధరలు పెంచడంతో ఇప్పుడు వారు దిక్కులు చూడాల్సి వస్తోంది. కూలీనాలీ చేసుకునే మహిళలు వారం రోజులు కష్టపడి సంపాదించిన కూలి డబ్బులను సిలిండర్‌కే వెచ్చిస్తే మిగతా అవసరాలు ఎలా తీరుతాయో అర్థం కావడం లేదని వాపోతున్నారు.
పెరుగు తున్న ధరలతో మళ్లీ కట్టెల పొయ్యినే నమ్ముకునే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, నూనె ధరలు భగ్గుమంటుండగా ఇప్పుడు వంట గ్యాస్ పెంచడం పేదలకు మోయ లేని భారమే. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంను పట్టించుకోకుండా ధరలు పెంచి పెనుభారం మోపడం తగదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవల్సిందే. ప్రభుత్వాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. దుబారాను అదుపు చేయాలి. అప్పుడే దేశంలో ధరలను అదుపు చేయగలం అని గుర్తించాలి. దీనిపై ముందుగా పార్లమెంటులో చర్చించాలి. పాలకుల జల్సా ఖర్చులపై, వారికి ఇస్తున్న టిఎడిఎలపై చర్చించాలి. ఆ దమ్ముల పాలకులకు,ప్రతిపక్షాలకు ఉందా లేదా అన్నది చర్చించాలి.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# కుందేలు కాదు... గిందేలు!

ఒక అడవిలో ఒక బుజ్జి కుందేలు ఉండేది. ఒకరోజు ఆ కుందేలు అడవిలో ఆడుతూపాడుతూ ఎప్పుడూ వెళ్ళని ఒక కొత్త ప్రదేశానికి చేరుకుంది. అక్కడ ఉన్న చెట్లు, మొక్కలు, గడ్డి అన్నీ కూడా దానికి కొత్తగా అనిపించాయి. వాటివైపు కుందేలు ఆశ్చర్యంగా కన్ను రెప్పలు కొట్టకుండా చూడ సాగింది.అందులో ఎర్రటి ఆకులు ఉన్న ఒక మొక్క కనిపించింది. ఈ బుజ్జి కుందేలు ఆశ్చర్యపోతూ... "అరే! అదేంటి ఈ మొక్క ఆకులు పచ్చగా కాక ఎర్రగా ఉన్నాయి? వీటిని రుచి చూస్తే పోలే? అని తన మనసులో అనుకున్నదే తడవుగా ఒక ఆకును తినగానే చాలా రుచిగా అనిపించింది. భలే భలే బావున్నాయి అని



అనుకుంటూ ఆ మొక్కకు వున్న ఆకులన్ని తిని వేసింది.
ఇంతలో అక్కడికి ఒక తోడేలు వచ్చింది. బహు లేతగా ఉన్న ఈ చిట్టి కుందేలును చూడగానే దాని నోరూరింది. మాట్లాడుతూ.. మాట్లాడుతూ... చటుక్కున ఎగిరి వగలమారి తోడేలు కుందేలును పట్టుకొని సంచిలో వేసింది. సంచిలో ఉన్న కుందేలు ఎంత బతిమిలాడినా వదలలేదు. వెంటనే అక్కడి నుండి తోడేలు తన నివాసానికి వెళ్ళింది. ఎంతో హాయిగా కడుపునిండా ఈ పూటకు తినవచ్చునని మనసులో అనుకుంటూ... సంచి విప్పి కుందేలును బయటకు తీసింది. ఆశ్చర్యం.! తెల్లటి కుందేలు ఎర్రగా మారింది. ఇదేమిటి అబ్బా! నేను తెల్ల కుందేలును పట్టుకున్నాను. ఇప్పుడేమో ఎర్రగా ఉంది అనుకుంది. ఒకింత భయపడ సాగింది.
"అమ్మో! ఇది కుందేలు కాదేమో! నేనే పొరపాటున కుందేలు నను కొని భూతాన్ని పట్టుకున్న నేమో!!" అనుకుంటూ గజ్జున వనక సాగింది. తోడేలు వాలకాన్ని చూసిన కుందేలు కాస్తంత ధైర్యం తెచ్చుకుని తన గొంతు సవరించుకుంటూ... "నేను కుందేలును కాను గిందేలును". నేను వింత లోకం నుండి వచ్చిన దాన్ని. భూలోకంలో తోడేళ్లు బాగా ఉన్నాయని విన్నాను. వాటిలో ఒక దానిని పట్టుకుని తినాలని వచ్చాను. నాకు ఇష్టం వచ్చినట్లు రంగులు మార్చడం మాత్రమే కాదు.. తలుచుకుంటే ఎంత పెద్ద జంతువునయినా సునాయాసంగా చంపేస్తాను.అని కుందేలు గంభీరంగా అంది.
ఆ మాటలు విన్న తోడేలు ఏదో మాట ముచ్చట చెబుతూనే..."పరుగో పరుగు అంటూ అడవి దిక్కు ఉరక సాగింది. దీనితో ప్రాణాలతో బయటపడిన కుందేలు "హమ్మయ్య... అంటూ ఊపిరి పీల్చుకుని తోడేలు బారినుండి కాపాడుకుంది. ఎర్రటి ఆకులు రుచిగా ఉండటమే కాదు... రంగు మారి తన ప్రాణాలు కాపాడుకోవడానికి కూడా పనికొచ్చాయి ". అనుకుంటూ తిన్నగా తన స్థావరానికి వెళ్ళిపోయింది.

–కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

# పెట్రో ధరలకు విరుగుడు ఎలక్ట్రిక్ వాహనాలు

## తయారీదారులను ప్రోత్సహించనున్న ప్రభుత్వం
## విద్యుత్ ఛార్జింగ్ సెంటర్లకు కూడా ప్రాధాన్యం

న్యూఢిల్లీ,మార్చి23( ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండుమూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగగనుంది. ఇక చమురు ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్




వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# హరిహర క్షేత్రంలో అంబరాన్ని స్పృశించిన భక్తి పారవశ్యం

పవిత్ర గోదావరినది తీరాన వెలసిన పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రం బుధవారం భక్త జన సంద్రంగా మారింది. క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్థానిక దైవాలు శ్రీలక్ష్మి నరసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వరుల రథోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రం నలు మూలలనుండే గాక, సుదూర ప్రాంతాల నుండి సనాతన వారసత్వ సాంప్రదాయాచరణలో భాగంగా, ఎతెంచిన ఆశేష భక్త యాత్రికజనం భగవన్నామ స్మరణలతో, జయజయ ధ్వానాలతో క్షేత్రం ప్రతిధ్వనించింది. భక్తులు పవిత్ర గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, ప్రధానాలయాల ముందు బారులుతీరి వేచి ఉండి దైవ దర్శనాలు చేసుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఎస్.ఈఓ శ్రీనివాస్, అభివృద్ది కమిటీ అధ్యక్షుడు రామయ్య , సభ్యుల ఆధ్వర్యంలో, రథోత్సవం సందర్భంగా దేవస్థాన వంశపారంపర్య పౌరోహితులు కందాళై పురుషోత్త మాచార్య, యాజ్ఞకులు ఆస్థాన వేద పండితులు రమేశ్ శర్మ ఆచార్యత్వంలో వివిధ ఆలయాల అర్చకులు ముందుగా యోగానంద, ఉగ్రనారసింహ, శ్రీవేంకటేశ్వ రాలయాలలో నిత్య పూజలు నిర్వహించారు. మద్యాహ్నం నుండి సాయంత్రం వరకూ దేవస్థానం ముందుంచిన ముువ్వురు స్వాముల యోగ ఉగ్రనారసింహ, వేంకటేశ్వరులను ఆసీనులు గావించగా భక్తులు. నిచ్చెనల ద్వారా అధిరోహించి, మొక్కులు చెల్లించు కున్నారు. రధాల చుట్టూ అష్ట దిక్పాలకులను పూజించి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చక్రతీర్థ కార్యక్రమార్థం, మంగళవాద్యాలతో, వేదమంత్రాలతో, దేవస్థాన బాధ్యులు, అర్చకులు, భక్తులు తోడు రాగా, గోదావరి నదిలో మంగళ స్నానాలు గావించి, క్షేత్ర ప్రదక్షణ ఆచరించి, దేవస్థానానికి తిరిగి వచ్చారు. ఆలయాలలో మహా నివేదనం చేసి



పుష్పయాగం (నాగవెల్లి)ని నిర్వహించారు. పుష్ప యాగము, గోపాల, వాసుదేవ, శంఖ పూజలు, శ్రీవత్సకౌస్తుభ, ద్వాదశ దేవతా, పురుష, నారాయణ సూక్త నామార్చనలు గావించారు. శ్రీలక్ష్మి నరసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పక్షాన రథోత్సవం సందర్భంగా భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని వేలామంది వినియోగించు కున్నారు. స్వామి వారల రదోత్సవం సందర్భంగా వందలాది భక్తులకు పులిహోర ఉచితంగా పంపిణీ చేసి, త్రాగు నీరందించారు. వాసవీ సేవా దళ ఆధ్వర్యంలో త్రాగునీరు, బటర్ మిల్క్ పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల ముఖ్య దినమైనందున, నదీస్నానం పుణ్యమని భావించే భక్తులు గోదావరి నదీ స్నానాలకై సుదూర ప్రాంతాలనుండి ఉదయాత్పూర్వమే క్షేత్రానికి చేరుకున్నారు. దక్షిణాభిముఖంగా ప్రవహిస్తు విశేష గోదావరిలో వేలాదిమంది భక్తులు, స్థానికులు మంగళ స్నానాలు ఆచరించారు.

### రథోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, గోదావరి తీరస్థ పవిత్ర తీరంగా పేరెన్నికగన్న ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ (ఉగ్ర, యోగానంద), శ్రీ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్ట సందర్భంగా



తాత్కాలిక టెంట్లు, క్యూలైన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వివిధ డిపోల నుండి నడిపిన ఆర్టీసి బస్సులను గుణంగా క్రమబద్ధీ కరించారు. ధర్మపురి సి ఐ కోటేశ్వర్, ఎస్ ఐ కిరణ్, సిబ్బంది ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారు.

### గోదావరి తీరాన భక్తుల గుడారాలు

ఏటా 13రోజులపాటు సాంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలకు సనాతన వంశాచార వారసత్వ ఆచరణలో భాగంగా సుదూర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు, యాత్రికులు ధర్మపురి క్షేత్రానికి అరు దెంచి, ఇక్కడ ఉత్సవాలలో పాల్గొ నడం అనవాయితీగా వస్తున్నది. ఈక్ర మంలో మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి క్రమం తప్పకుండా భక్తులు రావడం, మొక్కులు చెల్లించుకోవడం జరుగున్నది. సంవత్సరం పొడువునా మహారాష్ట్ర భక్తులు వస్తుండడం సత్సంప్రదాయారణ కాగా, కరోనా నివారణ కట్టుదిట్టాల విరామానంతరం ఈఏడు భక్తుల సంఖ్య ద్విగుణీకృతమైంది. క్షేత్రంలో నివాస, బస వసతులు సరి పోని స్థితిలో కొన్ని రోజులు ఇక్కడే మకాం వేసి, ఉత్సవాలలో పాల్గొన గోరే భక్తులు గోదావరి నది తీరాన తాత్కాలిక గుడారాలు వేసుకున్నారు. ఎండవేడిమిని తట్టుకుని, కొంతైనా రక్షింప బడేందుకు వెదురు కర్రలను, పైన కవరులను ఉపయోగించి నిర్మించుకున్న తాత్కాలిక నివాస యోగ్య గుడారాలు నిలువ నీడనిస్తున్నాయి.

### చలివేంద్రాల ఏర్పాటు

బ్రహ్మోత్సవ వేడుకలలో పాల్గొన డానికి సుదూర ప్రాంతాలనుండి విచ్చేస్తున్న భక్తుల రద్దీ దృష్ట్యా దాహార్తిని తీర్చేందుకు పురపాలక సంఘం, దేవస్థానం, ఆర్టీసీ, అన్నపూర్ణ అన్నదాన సత్రం, మద్ది కిషన్ పక్షాన పలువురు స్థానికులు వివిధ ప్రదేశాలలో త్రాగు నీటి సరఫరా కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా కోనేరు వద్ద పెండ్యాల మహేందర్ ఏర్పాటు చేసిన సౌకర్యాన్ని కోనేటికి తెప్పోత్సవాలకు వచ్చిన భక్తులు అధికంగా వినియోగించు కున్నారు. దేవస్థానం లోపల క్యూలైన్ల భక్తులకు శీతల జలాన్ని అందిస్తున్నారు.

### వేలాదిమందికి అన్నదానం

దేవస్థానం పక్షాన బ్రాహ్మణ సంఘం భవనంలో నిర్వహించిన అన్నదానాన్ని వేలాది మంది భక్తులు వినియోగించు కుంటున్నారు. ముఖ్యంగా కోరిన కోర్కెలు తీర్చే వరదుడైన యోగ, ఉగ్ర నారసింహుని తప్ప, డోలోత్సవాలు, రథోత్సవం సందర్భంగా గోదావరి స్నానాలు, దైవ దర్శనాలకై విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో అన్నదానం వినియోగించు కున్నారు. అన్నదానానికి వ్యాపార, వాణిజ్య వేత్తలు, రైస్ మిల్లర్లు, వివిధ ప్రాంతాల భక్తులు నగదు, వస్తు రూపేణ అందచేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక చైతన్య భారతి పాఠశాల విద్యార్థులు, ఆర్యవైశ్యులు, స్వచ్ఛంద సేవకులు భోజనాదుల ఏర్పాట్లకు, వడ్డనలకు సహకరించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించు కున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ఆధార్ అడ్రస్ మారితే అన్నింట్లోనూ మార్పు

న్యూఢిల్లీ,మార్చి23 :
ఆధార్‌లో చిరునామాను మారిస్తే అన్ని పత్రాల్లోనూ ఆటోమేటిక్‌గా మారిపోయే వెసులుబాటును కేంద్రం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందుకు అనుగుణంగా డిజిలాకర్‌లో మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ఇది అందుబాటులోకి వస్తే ఒక్క ఆధార్‌లో మార్చుకుంటే సరిపోతంది.
మారిన చిరునామాను ఆధార్‌లో అప్‌డేట్ చేస్తే సరిపోతుంది. దీంతో పాన్‌కార్డు, ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు వంటి అన్ని పత్రాల్లోనూ చిరునామా దానంతట అదే మారేలా డిజిలాకర్‌ను సులభతరం చేసేందుకు యుఐడిఎఐ యత్నిస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల సహకారంతో దీన్ని సాకారం చేయనుంది. ఆధార్ కార్డులో చిరునామా మారితే డిజిలాకర్‌లో స్టోర్ అయిన డ్రైవింగ్ లైసెన్స్‌లోనూ చిరునామా మారేలా ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతో చర్చలు ఆరంభించింది. ఆదాయ పన్ను శాఖ సహకారంతో పాన్ కార్డులోనూ ఇలాంటి మార్పులకు వీలు కల్పించటంపై దఅష్టి సారించింది. ప్రస్తుతం ఆధార్‌కార్డులో చిరునామా మారితే మిగతా పత్రాల్లో వివరాలను విడివిడిగా అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు– డ్రైవింగ్ లైసెన్స్‌లో చిరునామాను మార్చుకోవాలంటే కేంద్రీకఅత పోర్టల్‌లో విడిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి, రవాణా శాఖ కార్యాలయ అధికారులకు సమర్పించాల్సి వుంటుంది. అయితే ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఇటువంటి ఇబ్బందులు వుండవని యుఐడిఎఐ వెల్లడిస్తోంది. దీంతో అన్ని పత్రాల్లోనూ మార్చేందుకు వేర్వేరు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది.

# మీకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు

## బడులు, గుడులు కట్టించి ఊరు రుణం తీర్చుకోండి

## అమెరికా పర్యటనలో ఎన్నారైలతో కేటీఆర్ ముఖాముఖి

హైదరాబాద్,మార్చి23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఊరు మన బడి పథకంపై ఎన్ఆర్ఐలతో మంత్రి కేటీఆర్ ముఖాముఖి నిర్వహించారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో మీట్ అండ్ గ్రీట్ విత్ కేటీఆర్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధిలో మీ అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. మీకు మించిన బ్రాండ్ అంబాసిడర్స్ ఎవరూ ఉండరు. తెలంగాణ గురించి మీరే గొప్పగా ప్రచారం చేయగలరు. అభివృద్ధిలో ముందంజలో ఉన్నాం. మనం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహాయం చేయాలన్నారు. గుడులు కట్టించే వారు గుడులను కట్టించండి.. బడులు కట్టించే వారు బడులు కట్టించండి.. లైబ్రరీలు కట్టించే వారు లైబ్రరీలు కట్టించండి.. దీని వల్ల స్థానికుల నుంచి వచ్చే కృతజ్ఞత మరిచిపోలేనిదిగా ఉంటుందన్నారు. విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్నాం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు తెలంగాణలో కేవలం మూడు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొత్తగా 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు. అలా వైద్య విద్యతో పాటు స్కూల్ ఎడ్యుకేషన్‌ను పటిష్టం చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. రూ. 7,230 కోట్ల తో తెలంగాణలోని 26 వేల పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకరణం కట్టుకుందని కేటీఆర్ తెలిపారు. ఈ విద్యా యజ్ఞంలో మీరు కూడా పాలు పంచుకోవాలి. నా మాతృభూమి కోసం, నా గ్రామం, పట్టణం కోసం.. నేను ఏదైనా చేయాలి.. చేస్తే బాగుంటుందని, అవసరమైతే నా తల్లిదండ్రుల పేరు మీదో, నా గ్రాండ్ పేరెంట్స్ పేరు మీదో ఏదో చేయాలనుకుంటే ఈ విద్యాయజ్ఞంలో పాల్గొనే అవకాశం ఉంది. మీ మీద ఆధారపడి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమం కాదు. విద్యా రంగాన్ని పటిష్టం చేసేందుకు ప్రయివేటు వ్యక్తుల సహకారం కోసమేనని చెప్పారు. మీకు ఇష్టమున్న పాఠశాలను ఎంపిక చేసుకొని అభివృద్ధి చేయొచ్చన్నారు. ఇది ఒక అద్భుత అవకాశం అని కేటీఆర్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టబోతున్నా మని తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కనీస సదుపాయాలపై దృష్టి సారించామని స్పష్టం చేశారు. దేశానికి నిధులు సమకూరుస్తున్న నాలుగో అతిపెద్ద రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ 14 శాతం వృద్ధిరేటు



నమోదు చేశాం. దేశ జనాభాలో తెలంగాణ 12వ స్థానంలో ఉందన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి కరెంట్ కోతలతో తెలంగాణ అల్లాడుతోంది. కరెంట్ సమస్యను సీఎం కేసీఆర్ తొలి ఆరు నెలల్లోనే పరిష్కరించారు. విద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యం 7 వేల మెగావాట్ల నుంచి 16 వేల మెగావాట్లకు పెంచామని తెలిపారు.అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ను అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును నాలుగేండ్ల లోనే పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తున్నాం. తెలంగాణ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. పంజాబ్‌తో సమానంగా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పటి కరువు నేల నేడు దేశానికి అన్నపూర్ణగా మారిందన్నారు. ఇదంతా కేసీఆర్ సమర్ధవంతమైన పాలన వల్లే సాధ్యమైందన్నారు. టీఎస్ ఐపాస్ చట్టం అమలు చేసిన తర్వాత తెలంగాణకు పరిశ్రమలు తరలివచ్చాయి. ప్రపంచ స్థాయి కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని మంత్రి కేటీఆర్ తెలిపారు.

# అగ్నిప్రమాద ఘటన దురదృష్టకరం

**సామాన్య కూలీలు మరణించడం బాధాకరం**
**సంఘుఘటనా స్థలిని పరిశీలించిన మంత్రి తలసాని**
**మృతదేహాలను బీహార్‌కు తరలిస్తామన్న సీఎస్**
**అనధికార గోదాముల నిర్వహణపై చర్యలు**
**అధికారులతో చర్చించి**
**తగు చర్యలు తీసుకుంటాం**
**బోయిగూడ అగ్నిప్రమాద స్థలిని సందర్శించిన హోంమంత్రి**
**అగ్నిప్రమాదంపై బండి సంజయ్ విచారం**
**అగ్నిప్రమాద ఘటనపై గవర్నర్ తమిళసై దిగ్భ్రాంతి**
**మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటన**
**ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రేవంత్, విహెచ్**

హైదరాబాద్,మార్చి23:సికింద్రాబాద్‌లోని బోయిగూడలో అగ్నిప్రమాద ఘటనపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సిఎస్ సోమేశ్ కుమార్, ఇతర పోలీస్ అధికారులతో కలసి పరిశీలించిన ఆయన.. ప్రమాదానికి గల వివరాలను తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. ఈ ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించామని, విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని మంత్రి వెల్లడించారు.

బోయిగూడలోని ఓ టింబర్ డిపోలో బుధవారం ఉదయం 4 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి డిపో మొత్తానికి వ్యాపించడంతో పెద్ద ఎత్తున్న అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అదుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేశారు. మంటల ధాటికి గోడౌన్ పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో పదకొండు మంది అక్కడికక్కడే మరణించారని అధికారులు చెప్పారు. వీరిలో కొందరు సజీవదహనమవగా, మరికొందరు ఊపిరాడక చనిపోయారన్నారు. మరొకరు క్షేమంగా బయటపడ్డారని వెల్లడించారు. ప్రమాద సమయంలో టింబర్ డిపోలో 12 మంది ఉన్నారని చెప్పారు. మృతులంతా బీహార్‌కు చెందిన వలస కార్మికులని తెలిపారు. మృతులను బిట్టు, సికిందర్, దామోదర్, సత్యేందర్, చింటు, దినేష్, రాజేష్, రాజు, దీపక్, పంకజ్‌గా గుర్తించామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో టింబర్ డిపో, స్క్రాప్ గోదాం ఉన్నాయని పోలీసులు చెప్పారు. టింబర్ డిపో నుంచి స్క్రాప్ గోదాముకు మంటలు వ్యాపించాయన్నారు. పొగ దట్టంగా కమ్ముకోవడంతో మృతదేహాలను వెలికి తీయడానికి ఇబ్బందయిందని తెలిపారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అగ్నిమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ సోమేష్ కుమార్ మీడియాకు తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఐదు లక్షల నష్టపరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు.

అగ్నిప్రమాద ఘటనలో చనిపోయిన వాళ్లంతా బీహార్‌కు చెందిన వాళ్లన్నారు. వారి వారి ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీఎస్ సోమేష్ కుమార్ వెల్లడించారు. రాజధానిలో అనధికారికంగా ఉన్న గోదాములపై చర్యలు తీసుకుంటామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. నగరంలో ఇరుకు వీధులు, నివాసాల మధ్య చాలా గోదాంలు ఉన్నాయని చెప్పారు. సికింద్రాబాద్‌లోని బోయిగూడలో జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని హోం మంత్రి పరిశీలించారు.

ప్రమాద కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రమాదంలో 11 మంది మరణించారని చెప్పారు. మృత దేహాలను గాంధీ దవాఖానకు తరలించామని, అక్కడ వాటి గుర్తింపు జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటికే ఆరు మృతదేహాల గుర్తింపు పూర్తయిందని, ఐదుగురి మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. వారి మృతదేహాలను ఎయిర్ అంబులెన్స్‌లో స్వస్థలాలకు పంపిస్తామన్నారు. ప్రమాదంపై జీహెచ్ఎంసీ, పోలీసు శాఖ, అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో గోదాముల ఘటనపై అధికారులతో సమీక్షిస్తామన్నారు. నగరంలోని గోదాముల రక్షణ చర్యలపై చర్చిస్తామని చెప్పారు.

స్క్రాప్ గోదాం ఘటనపై అధికారులతో విశ్లేషిస్తున్నామన్నారు. హైదరాబాదులో ఇలాంటి గోదాంలు ఎన్ని ఉన్నాయో, ఎలాంటి చర్యలు చేపట్టాలో ఈ భేటీలో చర్చిస్తామన్నారు. ఇరుకు సందుల్లో, నివాసం ప్రాంతాల్లో ఇలాంటి స్క్రాప్ గోదాంలు హైదరాబాదులో చాలా ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతామన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. గోదాం యజమాని నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఓనర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఖర్చులతోనే మృతదేహాలను బీహార్‌కు తరలిస్తామన్నారు. చనిపోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియయజేస్తున్నానని హోంమంత్రి ప్రకటించారు. సికింద్రాబాద్ బోయగూడ అగ్నిప్రమాద ఘటనను రాష్ట్ర ప్రభుత్వం



సీరియస్‌గా తీసుకుంది. అగ్నిమాపక శాఖ, హైదరాబాద్ పోలీస్, జీహెచ్ఎంసీ, విజిలెన్స్ అధికారులతో హోం మంత్రి మహమూద్ అలీ అత్యవసరంగా సమావేశంకానున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రమాదాన్ని అధికారులు విశ్లేషించనున్నారు. తరుచూ గోదాంలపై దాడులు చేయాలని అగ్నిమాపక అధికారులకు హోమ్ మంత్రి మహమూద్ అలీ ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 11 మంది పేద కార్మికులు సజీవదహనం కావడం కలచివేసిందన్నారు. మృతులంతా బీహార్ వాసులని తెలిసిందని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. పొట్టకూటి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనుమతుల నుంచి ఫైర్ సేఫ్టీ చర్యల వరకు అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపమే ఇలాంటి ప్రమాదాలకు కారణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. అగ్ని ప్రమాదంపై గవర్నర్ తమిళిసై తీవ్ర సంతాపం తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు గవర్నర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే వారి కుటుంబాలను ఆదుకోవాలని గవర్నర్ తమిళిసై కోరారు. అగ్నిప్రమాదం ఘటనపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బోయిగూడ తుక్కు పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదం లో 11 మంది మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ అన్ని విధాలా అండగా ఉండి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. మృతుల కుటుంబా లకు రేవంత్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. హైదరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 11 మంది కూలీలు సజీవ దహనమవడం అత్యంత విషాదకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కూలీ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. స్థానిక శాసన సభ్యుడు కూడా రూ.5 లక్షలు ఇచ్చి చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని వీహెచ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులలో బీహార్ కూలీల శ్రమ వెలకట్ట లేనిదన్నారు. తెలంగాణలో ఉన్న ఐఏఎస్, ఐసీఎస్ అధికారులు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల నష్ట పరిహారం సరిపోదన్నారు. రాజకీయంగా కాకుండా మానవతా దృక్పథంతో ఆలోచించి, ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని వీహెచ్ కోరారు.

### షర్మిల పాదయాత్రలో అపశృతి

యాదాద్రి,మార్చి23: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. జిల్లాలోని మోట కొండూరు మండలం నుండి పాదయాత్రగా ఆత్మకూరు మండలానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో దుర్గసానినపల్లి గ్రామం వద్ద చెట్టుకింద గ్రామస్తులతో మాట్లాడు తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి.

అయితే అదృష్టవశాత్తు తేనెటీగల దాడి నుంచి షర్మిల బయటపడ్డారు. పలువురు కార్యకర్తలపై తేనెటీగలు దాడి చేశాయి. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థాన పాదయాత్ర 34వ రోజు కొనసాగుతోంది. బుధవారం ఆలేరు నియోజవర్గంలోని మూటకొండూరు మండలం వార్డురులో ప్రారంభమైంది. ఈ పాదయాత్ర ఆత్మకూరు మండలం పల్లెపహాడ్ వరకు కొనసాగనుంది. దారి పొడవునా ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలపై తెలుసుకుని ఓదారుస్తూ.. అండగా నిలుస్తానని భరోసానిస్తూ.. ముందుకు సాగుతున్నారు వైఎస్ షర్మిల.

# కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ తుడుపై ప్రివిలేజ్ నోటీస్

గిరిజన రిజర్వేషన్లపై తప్పుడు ప్రకటన

మంత్రి తీరుకు నిరసనగా లోక్‌సభ నుంచి టీఆర్ఎస్ వాకౌట్

సభలోనే మంత్రి క్షమాపణలు చెప్పాలన్న ఎంపీలు

కేంద్రమంత్రి ప్రకటనపై టీఆర్ఎస్ ఆగ్రహం

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

న్యూఢిల్లీ,మార్చి23: కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడుపై లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీలు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. కేంద్రం తీరుకు నిరసనగా ఎంపీలు బుధవారం లోక్‌సభలో ఆందోళన చేపట్టారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని టీఆర్ఎస్ ఎంపీలు నినాదాలు చేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం



పంపలేదని బిశ్వేశ్వర్ తుడు అబద్ధాలాడి, పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని ఎంపీలు నోటీసులో పేర్కొన్నారు. గిరిజనులకు, తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలని ఎంపీలు డిమాండ్ చేశారు. సభను తప్పుదోవ పట్టించిన బిశ్వేశ్వర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్ పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి, కేంద్రానికి పంపిందని టీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచాలని 2017లోనే తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర హోంశాఖకు పంపింది. బిల్లు తమ వద్దకు చేరిందని కేంద్ర హోంశాఖ కూడా అక్నాలెడ్జ్ చేసింది. కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ కూడా గిరిజనుల రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన అంశం కేంద్రం పరిశీలనలో ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో స్పష్టంగా చెప్పింది. ఇప్పుడేమో అసలు అలాంటి ప్రతిపాదనేదీ తమ వద్దకు రానేలేదని పార్లమెంట్‌లో దారుణంగా అబద్ధలాడింది. ఇదిలావుంటే టిఆర్ఎస్ ఎంపిలు నామా నాగేశ్వరరావు, కె కేశవరావు తదితరులు మాట్లాడుతూ కేంద్రం తీరు దారుణమన్నారు. అబద్దాలు చెప్పినందుకు సభావేదికగా మంత్రి క్షమాపణలు చెప్పాలన్నారు. కేంద్రమంత్రి ప్రకటనకు నిరసనగా టిఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు. బాలానగర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని దిష్టిబొమ్మను బుధవారం నేతలు, కార్యకర్తలు దహనం చేశారు. గిరిజన రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు రాలేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి పచ్చి అబద్దాలు చెప్పారని ఆరోపించారు. దీనికి నిరసనగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినదించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి వాల్యానాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరగ్గా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డైరెక్టర్లు, విద్యార్థులు, యువకులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

### వైభవంగా ధర్మపురీశుల

# రథోత్సవ వేడుకలు

మొదటిపేజీ తరువాయి..

ప్రత్యేకంగా ఏర్పరచిన క్యూలైన్ల ద్వారా అశేష భక్తులు, రథాలపైకి నిచ్చెనల ద్వారా వెళ్ళి రథా రూఢులైన స్థానిక దైవాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదమంత్ర ఘోషలు, మంగళ వాద్యాలు, జయజయ ధ్వనాల మధ్య దేవ స్థానంనుండి ఇసుకస్థంభం మీదుగా పురపాలక సంఘ కూడలి వద్ద గల నంది విగ్రహం వరకు నారసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వర రథాలను వరుసగా నిలిపి భక్తజనం అనుసరించగా, రథాలను ఊరేగించగా ముత్తయిదువులు రోడుకిరువైపులా నిలిచి మంగళ హారతులు పట్టారు. రాత్రి 7గంటలకు మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత తదితర ప్రముఖులతో కలిసి రతారూడు లయిన స్వామి దర్శనం చేసుకొని కంకణాలు కట్టు కున్నారు. అనంతరం దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలొనరించి గోదావరికి ఊరేగింపుగా వెళ్ళి చక్రతీర్థ మంగళ స్నానాలు ఆచరించారు. చక్రతీర్థం అనంతరం రాత్రి దేవస్థానానికి చేరుకున్నారు. ధర్మపురి సి ఐ కోటేశ్వర్, ఎస్ ఐ కిరణ్, సిబ్బంది ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారు.

## ధర్మపురిలో భక్తులకు సౌకర్యాల కల్పన భేష్

మొదటిపేజీ తరువాయి..

నుండి సైతం భక్తులు తరలి వచ్చారు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారని అభినందించారు ప్రజాప్రతినిధులు అధికారులు దేవస్థాన బాధ్యులు అభివృద్ధి కమిటీ బాధ్యులు ప్రముఖులు కలిసికట్టుగా బ్రహ్మోత్సవం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యాహ్న భోజనాన్ని తిరిగి ప్రారంభించండి

**లోక్‌సభలో డిమాండ్ చేసిన సోనియా**

న్యూఢిల్లీ,మార్చి23: విద్యార్థినీ, విద్యార్థులు ప్రత్యక్షంగా తరగతులకు హాజరవడం ప్రారంభమైనందువల్ల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మళ్ళీ ప్రారంభించాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రభుత్వాన్ని కోరారు. కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో దాదాపు రెండేళ్ళపాటు ప్రత్యక్ష తరగతులను నిర్వహించలేదన్న సంగతి తెలిసిందే. సోనియా గాంధీ బుధవారం లోక్‌సభలో మాట్లాడుతూ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించడం వల్ల అర్థాంతరంగా బడి మానేసినవారిని మళ్ళీ విద్య వైపునకు ఆకర్షించవచ్చునని తెలిపారు. బాలలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేయడం గురించి మాట్లాడిన సందర్భంగా ఆమె ఈ విజ్ఞప్తి చేశారు. కోవిడ్ మహమ్మారి వల్ల బాలలు తీవ్రంగా ప్రభావితులయ్యారని తెలిపారు. ఈ మహమ్మారి వచ్చిన తర్వాత మొట్టమొదట మూసివేతకు గురైనవి, చిట్టచివరిగా తెరిచినవి పాఠశాలలేనన్నారు. పాఠశాలలను మూసేయడం వల్ల మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా నిలిపేశారన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజలకు రేషన్ సరుకులను ఇచ్చారన్నారు. బాలలకు వండిన ఆహారాన్ని అందజేయడానికి ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. బాలల తల్లిదండ్రులు జీవనోపాధిని సంపాదించడం కోసం చాలా కష్టాలు అనుభవించారనే విషయం నిజమని చెప్పారు. ఇటువంటి సంక్షోభం గతంలో ఎన్నడూ రాలేదన్నారు. బాలలు తిరిగి పాఠశాలలకు వస్తున్నందువల్ల వారికి మంచి పోషకాహారం అవసరమని చెప్పారు. సమగ్ర శిశు అభివ?ద్ధి సేవలను పటిష్టపరచి, మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని తెలిపారు. ఇదిలావుండగా, కేంద్ర ప్రభుత్వం గత సెప్టెంబరు 29న ప్రధాన మంత్రి పోషణ్ స్కీమ్‌కు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందుతున్న దాదాపు 11 లక్షల పాఠశాలలకు ఈ పథకం వర్తిస్తుంది. దీనిలో మధ్యాహ్న భోజన పథకం కూడా ఉంది. 2022నాటికి బాలల్లో పోషకాహార లోపాలను నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## పెరుగుతున్న విమాన ప్రయాణికుల సంఖ్య

**రోజుకు దాదాపు 3.82లక్షల మంది ప్రయాణం**
**ప్రయాణికుల సంఖ్యను 400 మిలియన్లకు పెంచాలని లక్ష్యం**
**విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా వెల్లడి**

న్యూఢిల్లీ,మార్చి23: గత వారం రోజులుగా రోజుకు దాదాపు 3.82లక్షల మంది ప్రయాణికులు విమానాల్లో ప్రయాణించారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా బుధవారం తెలిపారు. ఇది కొవిడ్-19 ప్రభావిత రంగానికి ఆశాకిరణం లాంటిదన్నారు. 2023-2024 నాటికి రద్దీని దాదాపు మూడు రెట్లు 400 మిలియన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విమానయాన పరిశ్రమ సమస్యలు ఎదుర్కొంటున్న తరుణంలో జెట్, అకాలా త్వరలో కొత్తగా సేవలు ప్రారంభించబోతున్నాయన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం రంగంలో మార్పులను తీసుకువచ్చిందని, నిర్మాణాత్మక మార్పు జరిగిందన్నారు. డీజీసీఏ గణాంకాల ప్రకారం.. 2013-14లో ప్రయాణికుల సంఖ్య 6.70కోట్లు కాగా.. 2018-19 సంవత్సరంలో 14.50 కోట్లకు చేరుకుంది. అదే సమయంలో 2013-14లో విమానాల సంఖ్య 400 కాగా, 2018-19లో 710కి పెరిగింది. డీజీసీఏప్రకారం, 2021 సంవత్సరంలో 838 మిలియన్ల మంది దేశీయ విమానాల్లో ప్రయాణించారు. 2020లో ఈ సంఖ్య 6.3 కోట్లు. కరోనా మహమ్మారి విమానయాన రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. దేశీయ, అంతర్జాతీయ నిబంధనల కారణంగా చాలా రోజుల పాటు సేవలను నిలిచిపోయిన విషయం తెలిసిందే. కొవిడ్ తగ్గుముఖం పట్టడంతో తాజాగా విమానయాన రంగం పుంజుకుంటున్నది. నవంబర్ 2021లో దేశంలో ప్రయాణికుల సంఖ్య రోజుకు 3.90లక్షలకు పెరిగిందని, కరోనాకు ముందు రోజుకు ఈ సంఖ్య 4.15 లక్షలుగా ఉండేదన్నారు. ఒమిక్రాన్ ప్రవేశంతో 1.60లక్షలకు తగ్గిందని, ప్రస్తుతం గత వారం రోజులుగా 3.82లక్షలకు పెరిగిందని వివరించారు.

## ఈ నెల 31 నుంచి ఆంక్షలు ఎత్తివేత

**కరోనా కట్టడి నిబంధనలు ఉపసంహరణ**
**విపత్తు నిర్వహణ చట్టం నిబంధనలపై కేంద్రం ఆదేశాలు**

న్యూఢిల్లీ,మార్చి23: కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విపత్తు నిర్వహణ చట్టం నిబంధనలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉపసంహరిం చింది. అయితే కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విధించిన నిబంధనల అమలు కొనసాగుతుంది. ముఖానికి మాస్క్ ధరించడం వంటి నిబంధనలు అమల్లో ఉంటాయి. కోవిడ్-19 మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సన్నద్ధత, పరిస్థితిలో మొత్తం మీద కనిపిస్తున్న మెరుగుదల వంటివాటిని దృష్టిలో పెట్టుకుని విపత్తు నిర్వహణ చట్టం నిబంధనలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉపసంహరించింది. కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా జారీ చేసిన ఆదేశాల్లో అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ మేరకు సూచనలు చేశారు. కోవిడ్ కట్టడి చర్యల కోసం విపత్తు నిర్వహణ చట్టం, 2005 ప్రకారం ఆదేశాలు, మార్గదర్శకాల జారీని తగిన విధంగా ఉపసంహరించడంపై పరిశీలించాలని తెలిపారు. ప్రస్తుత నిబంధనల అమలు మార్చి 31తో ముగుస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జారీ చేసే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, సలహాలను పాటించడం కొనసాగించవచ్చునని తెలిపారు. కోవిడ్ కట్టడి చర్యలు, వ్యాక్సినేషన్, సంబంధిత ఇతర అంశాలపై సూచనలను అమలు చేయవచ్చునని పేర్కొన్నారు. ఇదిలావుండగా, మన దేశంలో రోజువారీ కోవిడ్ కేసుల సంఖ్య నిలకడగా తగ్గుతోంది. పాజిటివిటీ రేటు 0.5 శాతం కన్నా తక్కువగా ఉంది. అయితే యూరోపు, చైనా వంటి దేశాల్లో మళ్ళీ ఈ మహమ్మారి పెరుగుతుండటం కనిపిస్తోంది. బుధవారం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మన దేశంలో కొత్తగా 1,778 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. 62 మంది ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోయారు. యాక్టివ్ కేసుల సంఖ్య దాదాపు 23,000 ఉంది.

## నేడు టీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

కరీంనగర్,మార్చి23: టిఆర్ఎస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం జరుగనుంది. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పిలుపునిచ్చారు. పంజాబ్ రాష్ట్రంలో పండిన వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో కూడా వడ్లను కొనుగోలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు ఒకే విధానం ఉండాలనే ప్రధాన డిమాండ్‌తో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సీఎం కేసీఆర్ సూచించారన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు ఏర్పాటు చేసిన పార్టీ సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీపీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# వినియోగదారుల హక్కుల అవగాహన సదస్సులు నిర్వహించాలి



**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** కరీంనగర్ పట్టణంలో కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఇండియా) జిల్లా కమిటీ సమావేశాలు జిల్లా అధ్యక్షుడు పోశాల రవికుమార్ అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్ కుంట హాజరయ్యి మాట్లాడుతూ వినియోగదారులకు జరుగుతున్న మోసాలను ఎండగట్టాలని, ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా కమిటీకి సూచించారు. ప్రతి పాఠశాలలో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి వస్తువులో నాణ్యత లోపం తూకంలో మోసం జరుగుతోందని వాపోయారు. జిల్లాలో సభ్యత్వ నమోదు పెంచాలని, పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో కలుస్తూ వినియోగదారులకు ఎక్కడ కూడా అన్యాయం జరగకుండా సంస్థ ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోశాల రవికుమార్ మాట్లాడుతూ . రాష్ట్ర కమిటీ సూచన మేరకు వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ జిల్లా అధికారులకు మన సంస్థ నుండి మెమోరండం సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పామరాజు రామారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ గడప కోటేష్ కుమార్, జోనల్ ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, లీగల్ అడ్వైజర్ బండ విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి, రిటైర్డ్ డిఇఓ రామచంద్రం, సభ్యులు శ్యాం ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

## 28, 29 దేశవ్యాప్త సమ్మె నోటీస్ ఇచ్చిన ఆశ కార్యకర్తలు



**చిగురుమామిడి మార్చి 23 (ప్రజామంటలు):** ఈనెల 28, 29 తేదీల్లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుంది. ఈసమ్మెలో తెలంగాణ వాలంటరీ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (ఆశ) యూనియన్ పిలుపునిచ్చింది. ఈ ఇందుర్తి ఆశా కార్యకర్తలు డా. నిర్మల కి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆశ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయడం లేదు, పారితోషికాల పద్ధతి ని రద్దు చేయాలని, ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం 26,000 వేలు ఇవ్వాలని, పిఎఫ్, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని, కరోనా సమయంలో 20 లక్షల కోట్ల బడ్జెట్ ను కేంద్రం ప్రకటించింది కానీ కానీ ఇందులో ఆశా వర్కర్లకు ఏమి కేటాయించలేదు, కరోనా కట్టడిలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల పట్ల నిర్లక్ష వైఖరిని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడనాడాలని సమ్మె చేస్తున్నాము. 28, 29 వతేదీన జిల్లాలోని ఆశా కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, నాగరాణి, కమల, పూజ పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సార్వతిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు



**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** మార్చి 28,29 తేదీలలో దేశవ్యాప్తంగా కార్మిక,ఉద్యోగ సంఘాలు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన సంపూర్ణ మద్దతు తెలుపుతూ,కార్మికులు పార్టీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోనగంటి కేదారి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక,కర్షక పేద ప్రజలకు వ్యతిరేకంగా కార్పోరేట్ కంపెనీ సంస్థలకు అనుకూలంగా పాలన కొనసాగిస్తుందని అందులోభాగంగా కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే నేషనల్ మానిటైజేషన్ ను ఉపసంహరించు కోవాలని, అధిక ధరలను నియంత్రించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని చేయాలని, 2020 విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ మార్చి 28 -29 తేదీలలో రెండు రోజులపాటు సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చన సందర్భంగా సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు, నిరుపేద ప్రజలు, సీపీఐ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని, అన్ని రంగాల వాణిజ్య, వ్యాపార వర్గాలు సమ్మెకు సహరించాలని కేదారి పిలుపునిచ్చారు.ద

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నకు విరాళం



కొడిమ్యాల మార్చి 23 ( ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం నకు కొడిమ్యాల గ్రామానికి చెందిన బత్తిని దేవేందర్-పద్మ వీరి సంతానం రుచిత- శ్రీ చరణ్ ల కుటుంబం శాశ్వత చందాదారులుగా 25,016/- (ఇరవై ఐదు వేల పదహారు) రూపాయలను విరాళముగా అందజేసినారు. దేవేందర్, పద్మ ల పెళ్లి రోజు సందర్భంగా ఆలయమునకు విచ్చేసి విరాళం అందజేసినారు. ఇట్టి విరాళం అందించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి స్వామి వారి మంగళా శాసనాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విరాళం అందించిన దాతల కుటుంబంనకు ఆలయ నిర్మాణ కమిటీ మరియు గ్రామస్థుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మట్టిలో మాణిక్యం

### మై విల్ఏజ్ షో గంగవ్వ



కొడిమ్యాల మార్చి 23 (ప్రజామంటలు): పల్లె నుండి పట్నం వరకు పరిచయం అక్కర్లేని పేరు గంగవ్వ. కొడిమ్యాల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు గారిని కలిసిన మై విలేజ్ షో గంగవ్వ. కొడిమ్యాల మండలం లోని హిమ్మత్ రావు పేట్ గ్రామంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణారావు శాలువాతో సత్కరించి గంగవ్వ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ..... సహజమైన నటనతో తెలుగు ప్రజలందరిని మెప్పించి బిగ్ బాస్ షో లాంటి ప్రతిష్టాత్మక వేదికలపై తన నటనతో ప్రజలందరి దృష్టినీ ఆకార్షించారనీ ఈ రోజుల్లో 'మై వీల్ ఏజ్ షో గంగవ్వ' అంటే తెలియని వారు ఉండరు అని "మట్టిలో మాణిక్యం గంగవ్వ" అని గంగవ్వ మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడిపల్లి గ్రామ సర్పంచ్ తిరుపతి, తెరాస అధ్యక్షులు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నవతరానికి మార్గదర్శి భగత్ సింగ్




**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** దోపిడి పీడన అణచివేత లు కుల మత లేని సమసమాజ స్థాపన కై పోరాడుదాం, బ్రిటిష్ ప్రభుత్వం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట వీరుడు స్వతంత్ర సమరయోధులు షాహిద్ భగత్ సింగ్ నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం అని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. తిరుపతి అన్నారు. స్థానిక భగత్ నగర్ లోని భగత్ సింగ్ విగ్రహాన్ని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్ తిరుపతి మాట్లాడుతూ.... దేశం కోసం 23 సంవత్సరాల అతి చిన్న వయసులో ఉరికంబం ముద్దాడిన విప్లవ యువకిశోరం భగత్ సింగ్ కు భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ విగ్రహాన్ని పార్లమెంట్లో నెలకొల్పాలని వారు అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప పోరాట వీరులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్ వీరి జీవిత చరిత్రను ఈ పాఠ్యాంశంలో చేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు దేశంలో దేశం కొరకు ప్రాణాలర్పించిన గొప్ప పోరాట వీరులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోవడం సిగ్గుచేటు అని ప్రభుత్వాన్ని విమర్శించారు. భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాడు భగత్ సింగ్ దేశంలోని మత విభేదాలే బ్రిటిష్ వారికి సహకరించాలన్న వాస్తవాన్ని గుర్తించిన భగత్ సింగ్ జీవితాంతం మత రాజకీయాలని వ్యతిరేకించాడు అని గుర్తు చేశారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పించకుండా నిరుద్యోగ యువత హక్కులను కాలరాస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యోగ ఉపాధి సాధనకై పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వంశీ కుమార్ నాయకులు, నవీన్, నరేష్, వెంకటేష్, సునీల్, శివ కుమార్, అశోక్, వంశీ, రాజు పాల్గొన్నారు.

# సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయండి

**వేదిక: మార్చ్ 25 న, మాజీ ప్రధాని పీవీ స్వగ్రామం వంగర**

భీమదేవరపల్లి మార్చి 23 (ప్రజామంటలు): స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ స్వగ్రామం వంగరలో ఈ నెల 25 న, జరిగే సీపీఐ మహాసభకు ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూద. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారతదేశంను విముక్తి చేయుటకు దోపిడి రహిత సమ సమాజ స్థాపన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26 న, అవిర్భవించిందని అన్నారు. తెలంగాణలో నైజాం నిరంకుశత్వానికి , జమిందారుల జాగీర్దారులకు వెట్టిచాకిరీకి , బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణను విముక్తి చేయాలని కా. బద్దం ఎల్లారెడ్డి, కా. రావినారాయణరెడ్డి, కా. ముగ్దుమ్ మొయినోద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. భీమదేవరపల్లి మండలం అభివృద్ధి కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను నడిపిన చరిత్ర సీపీఐకి ఉందని తెలిపారు. ప్రధానంగా ఈ మండలం మెట్ట ప్రాంతం దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయాలని రైతాంగాన్ని ఆదుకోవడానికి సీపీఐ ఉద్యమిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలని మరియు ఇళ్ళ స్థలాల కోసం భూ పోరాటాలను నిర్వహించడం జరిగిందని అన్నారు. కొత్తకొండలో ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రా బ్యాంకు ఏర్పాటుకు మరియు ఆలయ అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులను మంజూరు చేయడంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి తీవ్ర కృషి చేశారని తెలిపారు. ముఖ్య అతిథులుగా కా. చాడ వెంకట్ రెడ్డి, కా. తక్కళ్ళపెల్లి శ్రీనివాస్ రావు, కా. మేకల రవి, కా. కర్రె భిక్షపతి, కా. నేదునూరి జ్యోతి, మారుపాక అనిల్ కుమార్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్ హాజరౌతారని తెలిపారు. మండల, జిల్లా నాయకులు కొంగల రామచంద్రారెడ్డి, మంచాల తిరుపతి, డా. కూన యాదగిరి, కొదురుపాక శ్రీనివాస్, మంచాల రమాదేవి, మార్పు సంజీవరె

## కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ధర్నా



**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా కరీంనగర్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ కళ్యాడపు ఆగయ్య మాట్లాడుతూ.... ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగియగానే కేంద్రప్రభుత్వం వంట గ్యాసుపై 50.రూ, పెట్రోలుపై 97. పైసలు, డీజిల్ పి 87. పైసలు పెంచడం దారుణం అని ఇప్పటికే వంటగ్యాస్ ధర ఆకాశాన్ని అంటి సామాన్య ప్రజలకు అందకుండ ఉన్నది. ఇప్పటికే ప్రజలు మోయలేని భారంగా తయారైనది. ప్రజల నడ్డి విరిగిపోతున్న కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి ఏమాత్రం పట్టించుకోకపోవడం ఆయన, ఆయన ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. ఇప్పటికే గ్యాస్ ధర మండి పోతున్నది. పెరిగిన ధరతో 1000.రూ పెరిగి పేద ప్రజలకు భారంగా మారిన ఈ దరను ఎవరు భరించగలరో ప్రధానమంత్రి మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నవి పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలతో మరింత ఆకాశాన్ని అంటుతు పెదప్రజలు బ్రతికే పరిస్థితి లేకుండ పోయినది. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి మోదీ కి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని తెలుపుతు ఇప్పటికైనా పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వేంటనే తగ్గించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాడపు ఆగయ్య, ఎడ్ల వెంకటయ్య, నాగుల బాలగౌడ్, సాయిల్ల రాజమల్లయ్య, సందబోయిన రాజేశం, అలీమిల్ల కిషన్, ఎస్ కె. హైమద్, మిట్టపెల్లి శ్రీనివాస్, ధర్గయ్య, బి.నరేందర్ దత్తు పాల్గొన్నారు.

## హోమ్ మినిస్టర్ కు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ వినతి



**హనుమకొండ మార్చి 23 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర హోమ్ మినిస్టర్ మహమ్మద్ అలీకి బుధవారం హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన 80 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా శిధిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. విద్యా శాఖ అధికారులను మరియు మండల విద్యాధికారులను ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన హోమ్ మినిస్టర్ మహమ్మద్ అలీ15 రోజులలో కేసీఆర్ ప్రకటించిన ఉద్యోగాలు భర్తీ చేయబడతాయని హామీ ఇచ్చారు. విద్యారంగ సమస్యలు అన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ, స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన 80 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయకుంటే జిల్లాలో ప్రజా ప్రతినిధుల ఇల్లు ముట్టడిస్తామని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు అంతా తీవ్ర ఆవేదనలో అసంతృప్తిలో ఉన్నారని, ఆత్మహత్యలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యా రంగానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు తంగళ్ళపల్లి రఘు, కసర బోయిన రవితేజ, కేతిరి ఉపేందర్, జిల్లా నాయకులు మహేందర్ పాల్గొన్నారు.

# గిరిజన రిజర్వేషన్ పెంపుపై ప్రభుత్వాల నాటకాలు

జనగామ మార్చి 23 (ప్రజామంటలు): రాష్ట్రంలో గత ఎనిమిదేళ్ళలో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచకుండా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ తీవ్రంగా విమర్శించారు. గిరిజన సంఘం, జనగామ టౌన్ సమావేశం తేజావత్ గణేష్ నాయక్ అధ్యక్షతన జరగగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.... 10 శాతానికి రిజర్వేషన్ పెంచాల్సి ఉండగా పెంచకుండా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టిఆర్ఎస్ రెండు ప్రభుత్వాలు గిరిజనులను తీవ్రంగా మోసం చేశాయని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజనులకు 10% రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చిందని అన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్ పెంచుకోవడానికి రాష్ట్రాలకు అధికారం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పోరాటం చేసి సాధించడంలో తీవ్రంగా విఫలమైందని ఆరోపించారు. గత ఎనిమిదేళ్లుగా కాలయాపన చేసిన ఫలితంగా గిరిజనులు విద్యా, ఉద్యోగ , రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్ట పోయారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు నోటిఫికేషన్ వస్తున్న క్రమంలో కేంద్ర బిజెపి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆర్థిక మంత్రి హరీష్ రావు గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ లు విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. ఈ పోరాటం అసెంబ్లీ తీర్మానం పంపిన అప్పుడే చేసి ఉంటే ఈ పాటికి గిరిజన రిజర్వేషన్ సాకారం అయ్యేదని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ చేసిన గిరిజన రిజర్వేషన్ తీర్మానమే రాలేదని సాక్షాత్తూ పార్లమెంట్లో గిరిజన మంత్రి ప్రకటించడం బిజెపి ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఉత్తరాలు, ప్రత్యుత్తరాల కాపీలను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేసినందున రాష్ట్ర బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. గిరిజనులను మోసం చేసిన బిజెపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా త్వరలోనే అన్ని గిరిజన సంఘాలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేజావత్ గణేష్ నాయక్, అజ్మీర సురేష్ నాయక్, లావుడియా అనిల్ చౌహాన్, గిరిజన సంఘం జిల్లా నాయకులు ధరావత్ శీను, నరసింహ, ప్రకాష్, అజ్మీర సాయికుమార్, నరసింహ బానోతు బాలు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు

**జనగామ మార్చి 23 (ప్రజామంటలు):** స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులలో భగత్ సింగ్ ఒకరని వారి ఆశయ సాధన కోసం ఎల్లప్పుడూ పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు ధర్మభిక్షం అన్నారు. జనగామ ఏబీవీ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు దడిగ సందీప్ అధ్యక్షతన భగత్ సింగ్ రాజ్, గురు సుఖ్ దేవ్ 91 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారత స్వాతంత్రం కోసం బ్రిటిష్ తో పోరాడి ఉరికంబాన్ని సైతం ముద్దాడిన వీరుడు భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ అన్నారు.

# ప్రభుత్వ శిఖం భూముల కబ్జాపై విచారణ జరిపించాలి



**తిమ్మాపూర్ మార్చి21 (ప్రజామంటలు):** మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం మరియు గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ శిఖం భూములు సర్వే నెం 447లో 19-09 ఎకరాలు సర్వే నెం 287లో 10-37 ఎకరాలు సర్వే నెం 15 లో 4-14 ఎకరాల భూమిని మానకొండూర్ ఎమ్మెల్యే అనుచరులు అధికార పార్టీ నాయకులు భూములను ఆక్రమించి ఎలాంటి పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ నిధులతో మట్టి పోసి సీసీ రోడ్డు నిర్మాణం చేసి అమాయక ప్రజలకు అమ్మి మోసం చేస్తున్నారు అని, కావున అట్టి భూమిని సర్వే జరిపించి అందులో చేపట్టిన నిర్మాణాలను తొలగించి కబ్జాదారుల నుండి భూమిని కాపాడి వారిపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మడుపు మోహన్ తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, పొలంపల్లి ఎంపీటీసీ బండారి రమేష్, మాజీ సర్పంచ్లు బుదిగే కొండయ్య, గంకిడి లక్ష్మారెడ్డి, నాయకులు గవ్వ రాజేందర్ రెడ్డి, లింగమూర్తి, మోహన్, ఆశిక్ పాషా పాల్గొన్నారు.



దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పుట్టిన రోజు వేడుకలలో పాల్గొని శు భాకాంక్షలు తెలియజేసిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కవిత

## శ్రీ మడేల్లయ్య స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే రసమయి



**మనకొండూర్ మార్చి21 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామంలో ఘనంగా జరిగిన మడేల్లయ్య స్వామి జాతరలో రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్ మరియు మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవంపల్లి మరియు మద్దికుంట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

## జిల్లా కోర్టులో హాజరైన రాజశేఖర్ రెడ్డి



**మానకొండూర్ మార్చి 21 (ప్రజామంటలు):** మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అవినీతి, అక్రమాలను మరియు ఆక్రమణలను ప్రశ్నించినందుకు నాపై పెట్టిన తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణలో భాగంగా కరీంనగర్ జిల్లా కోర్టులో హాజరు కావడం జరిగింది అని తెలియజేసారు రాజశేఖర్ రెడ్డి. అనంతరం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రజా సమస్యలపై, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మానకొండూర్ బిడ్డగా నియోజకవర్గ ప్రజల పక్షాన, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తే ప్రజలలో వచ్చిన చైతన్యాన్ని సహించని ఎమ్మెల్యే రసమయి అనుచరులతో దాడి చేపించి, భారత రాజ్యాంగం రక్షణగా ఇచ్చిన చట్టాన్ని కాపాడాల్సింది పోయి మీ కుటుంబ అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి దుర్వినియోగం చేస్తూ నాపై అట్రాసిటీ కేసుతో పాటు పలు అక్రమ కేసులు పెట్టించావు. నువ్వు 4 కేసులు కాదు...400 కేసులు పెట్టిన ప్రజా సమస్యలపై, అధికార పార్టీపై నా పోరాటం ఆగదు. నిన్ను మానకొండూర్ నియోజకవర్గం నుండి ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

# ఏప్రిల్ 9న ఛలో హైదరాబాద్ రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరి



**జనగామ మార్చి 23 (ప్రజామంటలు):** ఏప్రిల్ 9న ఛలో హైదరాబాద్ రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరిని జయప్రదం చేయాలని ఏప్రిల్ 9న ఛలో హైదరాబాద్ రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరిని జయప్రదం చేయాలని ఎంఆర్ పిఎస్, ఎం.ఎస్.పి. జనగామ జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య అన్నారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం బంజర గ్రామం నుండి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరి ప్రచార యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి కెసిఆర్ రూపంలో వచ్చిన ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రచార యాత్ర చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడమటింటి నరసింహ, కొంగరి రాములు, కరుణాకర్ రాజు, మహాజన గళం సురేష్ మహాజన్, మేడ సుధాకర్, ఇనుముల అనిల్, శంకర్, చందు, రాజేష్, నరేష్ పాల్గొన్నారు.



దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పుట్టినరోజు వేడుకలలో పాల్గొని శు భాకాంక్షలు తెలియజేసిన జగిత్యాల వాసి వడ్లకొండ కరణ్

వైద్య సిబ్బందిని ఉద్యోగాల్లో కొనసాగించాలి.

## ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయి రెడ్డి డీఎమ్మెచ్వో కు వినతిపత్రం



**సికింద్రాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** కరోనా విజృంభించిన వేళ ప్రాణాలకు తెగించి పనిచేసిన అవుట్సోర్సింగ్, కాంట్రాక్టు వైద్య ఉద్యోగులందరిని కొనసాగించాలని ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్ జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డా. వెంకట్ ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన వైద్య సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టు, ఏ ఎన్ ఎం లు ప్రజలకు ఎన్నో సేవలు అందించారని చెప్పారు. కరోన సమయంలో ప్రభుత్వం రిక్రూట్ మెంట్ చేసుకున్న వైద్య సిబ్బందిని ఉన్నపళంగా తొలగిస్తున్నామని నోటీసులు జారీచేయడం బాధాకరమైన విషయం అన్నారు. ప్రభుత్వం స్పందించి వైద్య ఉద్యోగుల కాంట్రాక్టును పొడిగించి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోత్న్స, సునీత, విశాల, సరోజ, లావణ్య, లోహిత్, ప్రేమ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజారాం పల్లి గ్రామంలో బీరన్న భోనాల జాతర కు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్న సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తల్లి అనసూయ స్వర్గ పాత్ర కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్. వారితో వెంట కౌన్సిలర్లు బొడ్ల జగదీష్, కోరే గంగమల్లు, నాయకులు డిష్ జగన్ ఉన్నారు.




భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల జయంతి న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి దూసరి నాగరాజు, ప్రశాంత్, రామగళ్ళ శ్రీను, కొయిలికార్ సాయి కుమార్, మంద అశోక్, పంతుల సురేష్, బొట్టు సాంబ శివ, బాషపాక విష్ణు, మారేడి వినోద్.

## జిల్లాలోని పోలీస్ స్టేషన్ లలో పాత ఎలక్ట్రానిక్ వస్తువుల వేలం

జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు): జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ లో ఉన్న పనిచేయని ఇన్వెర్టర్స్, మరియు బ్యాటరీ లు, పనిచేయని కంప్యూటర్ మనిటర్స్, ప్రింటర్స్, లాన్ కనెక్షన్ స్విచ్ లకు సంబంధించిన వస్తువులను రెండు కేటగిరీలుగా విభజించి బహిరంగ వేలంపాట నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క వేలం పాటలో పాల్గొనదలచిన వారు తమ యొక్క ఆధార్ కార్డులతో తేదీ:31-03-2022 గురువారం రోజున ఉదయం 10 గంటలకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయమునకు రావలసిందిగా జిల్లా అదనపు ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ యొక్క వేలం పాటకు సంబంధించిన వివరాలకోసం కమ్యూనికేషన్ ఎస్.ఐ. నర్సింహా రావు ఫోన్: 8332995370 నందు సంప్రదించగలరని కోరారు.

# శాతవాహనకు 12-బి హోదా, నెరవేరిన కళ, ఫలించిన ఎంపీ బండి సంజయ్ ప్రయత్నం

**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** శాతవాహన వర్సిటీకి 12-బి హోదా కలిపించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చేసిన విన్నపాలు ఎట్టకేలకు ఫలించాయి. తెలంగాణ రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలు ఉన్నట్లుగానే శాతవాహనకు కూడా ఈ హోదా అందాలని ఆయన పలుమార్లు యూజీసీకి విన్నవించారు. ఇందులో భాగంగానే 2021 డిసెంబర్ 10న యుజిసి సెక్రటరీని కలిశారు. తాజాగా హోదాను కల్పిస్తూ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉంటుందనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించచడం లేదని, దీనివల్ల భవిష్యత్తులో విశ్వవిద్యాలయాల పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే పరిస్థితి ఏర్పడిందని.. అప్పట్లో ఇక్కడి పరిస్థితిని వివరించడంతో పాటు ఖచ్చితంగా ఈ హోదాను అందించాలని కోరారు. ఇందుకు సంబంధించిన అంశాలు యూజీసీ కార్యదర్శి, సీపీవో రజ్నీష్ జైన్ కు సంజయ్ అప్పట్లో వివరించారు. శాతవాహన యూనివర్సిటీకి 12(బి) హోదా లేకపోవడంతో, యూనివర్సిటీలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆయన దృష్టికి సంజయ్ తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయానికి కావాల్సిన నిధులు సమకూరడం లేదని పేర్కొన్నారు. మారిన నిబంధనలతో యూనివర్సిటీలో ఖాళీలను భర్తీ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని, అందుకోసం వీలైనంత త్వరగా క్షేత్ర స్థాయికి బృందాలను పంపి పరిశీలించాలని విన్నవించారు. అంతేకాకుండా పలుమార్లు ఈ విషయమై సెక్రటరీ తో పాటు



చైర్మన్, ఇతర అధికారులతో మాట్లాడి కరీంనగర్ కు ఈ హోదాను అందించేలా చొరవ చూపించారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చొరవ వల్ల 12-బి హోదా దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీంతో శాతవాహన యూనివర్సిటీలో నెలకొన్న ఇబ్బందులన్నీ తొలగిపోతాయని అన్నారు. శాతవాహన వర్సిటీకి 12-బి హోదా కల్పించే విషయంలో తన వినతి మేరకు స్పందించిన యూజీసీ కార్యదర్శి రజ్నీష్ జైన్ కు, ఆ కమిటీకి విద్యార్థుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ శాతవాహన యూనివర్సిటీ అవసరమైన చేయూతని అందిస్తానని ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# టికెట్ల రేటు పెంపు అక్రమాలపై చర్యలు

### అడిషనల్ కలెక్టర్ కి జెఎసి ఫిర్యాదు

జనగామ మార్చి 23 (ప్రజామంటలు): ప్రముఖ దర్శకులు రాజమౌళి దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్, రాం చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ సినిమా కోసం కోట్లాదిమంది అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇదే అభిమానాన్ని అలుసుగా తీసుకున్న నిర్మాతలు ప్రభుత్వాల నుండి టికెట్ల రేటు పెంపుకు అనుమతులు తీసుకొని రేట్లు ఎడా పెడా పెంచుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అభిమానులకు టికెట్ రేట్లు భారమైనప్పటికి అభిమానంతో సినిమాకు వెళుతున్నారు. ఇదే అదునుగా తీసుకున్న థియేటర్ యాజమాన్యాలు ఎప్పుడు లేని జిఎస్టి పేరుతో 18% అధికంగా, అక్రమంగా రేట్లు పెంచారు. ప్రభుత్వం రూ. 50 పెంపుకు అనుమతిస్తే వీళ్లు జి.ఎస్.టి. పేరుతో రూ.86 వరకు పెంచారు. దీంతో ఒక సగటు అభిమాని సినిమా చూడలేని పరిస్థితి, కుటుంబంతో వెళ్లాలంటే ఒక నెల జీతం పెట్టాల్సిన వస్తుందని బాధపడుతున్నారు. జిఎస్టి పేరుతో అక్రమంగా పెంచిన రేట్లను తొలగించాలని సినిమా అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతి తీసుకున్న రేటుకన్నా ఎక్కువ రేటు తీసుకుంటున్న



థియేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకి జెఎసి ఫిర్యాదు చేసింది. నాయకులు మంగళంపల్లి రాజు, గన్ను కార్తీక్, ఆసర్ల సుభాష్, వెంపటి అజయ్ పిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ హామి ఇచ్చారు.

# బోయిగూడ ఘటనపై అనుమానాలున్నాయి..

### పూర్తి స్థాయి విచారణ జరిపించాలి

### సీసీ పుటేజీలను భద్రపర్చాలి

### మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి

**సికింద్రాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** బోయిగూడ లో బుధవారం తెల్లవారుజామున సంభవించిన ఘోర అగ్ని ప్రమాద ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపి , నిజాలు నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఘటన స్థలానికి చేరుకొని మీడియాతో మాట్లాడారు. గతంలో కూడ పలుమార్లు ఇదే ప్రాంతంలో ఫైర్ ఇన్సిడెంట్స్ చోటు చేసుకున్నాయని ఆయన గుర్తు చేశారు. 2020 దసరా రోజున ఇక్కడనే కట్టెల దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగిందని, ఆ ఘటన నుంచి పాఠాలు నేర్చుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ రోజు ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరిగేదా..? అని ఆయన ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ రోజు 11 మంది చావుకు కారణమని అన్నారు. కొందరు షార్ట్ సర్క్యూట్, కొందరు సిలండర్ పేలిందని అంటున్నారని, కాని



ఇందులో పలు అనుమానాలున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ఈ స్థలాలు క్రయవిక్రయాల్లో ఏమైన గొడవలు ఉన్నాయా..అనే కోణంలో కూడ పోలీసులు పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిసర ప్రాంతాల సీసీ పుటేజీ భద్రపరచాలని కోరారు. ప్రమాదంలో మరణించిన బాధితుల కుటుంబాలకు రూ 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

# రామ్ మనోహర్ లోహియా జన్మదిన వేడుకలు

**జన్నారం మార్చి 23 (ప్రజామంటలు):** జన్నారం మండల కేంద్రంలోని సమాజ్ వాదీ పార్టీ మండల కార్యాలయంలో సమాజ్ వాదీ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కాలువ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రామ్ మనోహర్ లోహియా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి గారు మాట్లాడుతూ 2 లక్షలు ఇస్తే ఎస్.ఎం.సీ. కమిటీలో సభ్యత్వం, 10 లక్షలు ఇస్తే ఒక తరగతి గది, 25 లక్షలిస్తే ప్రాథమిక పాఠశాలకు, 50 లక్షలు ఇస్తే ప్రాథమికోన్నత పాఠశాలలకు, 1 కోటి రూపాయలు ఇస్తే ఉన్నత పాఠశాలకు దాతల పేర్లు లేదా వారు సూచించిన పేర్లు పెడతామని చెప్పారు. ధనవంతుల పేరు ప్రఖ్యాతలకై సామాజిక వర్గాలను బలి చేసే వ్యూహంలో తెలంగాణ ప్రభుత్వం కనబడుతుంది. 2 లక్షల 57 వేల కోట్ల రూపాయల రాష్ట్ర బడ్జెట్ తెలంగాణలో పాఠశాలల అభివృద్ధికై చేతులు రావడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రభుత్వ బడ్జెట్లో విద్యకు పదకొండు శాతం నిధులు కేటాయించింది తర్వాత క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం 6 శాతానికి ఎందుకు కుదించింది. కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యకు కేటాయించాలి.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై విద్యార్థులు ఉద్యోగులు కళాకారులు మేధావులు సామాజిక వర్గాలు మరియు మహిళలు చేసిన పోరాటాలను మర్చిపోగలమా? వందలమంది అమరత్వంతో తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. అమరుల మరియు ఉద్యమకారుల పేర్లు పాఠశాలలకు పెడితే విద్యార్థులు స్ఫూర్తి పొందుతారు కదా. అక్రమ మార్గంలో వ్యాపారులు, కాంట్రాక్టర్లు సంపాదించిన డబ్బుతో పేర్లు పెట్టి విద్యార్థులను బానిసలను చేద్దాం అనుకుంటున్నారా? ఆత్మ గౌరవం కోరుకునే ప్రజలు విద్యకై బిక్షమెత్తుకోవాలా? నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? అది రాజ్యాంగం కల్పించిన హక్కు. విద్య మా జన్మహక్కు. అమరుల ఆశయ సాధనకై



విద్యాలయాలను అమరుల పేర్లతో కీర్తింప చేద్దాం- డబ్బు మాఫియా నుండి విద్యను రక్షించుకుందాం. డా. రామ్మనోహర్ లోహియా జయంతి మార్చి 23-2022 నుండి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఏప్రిల్-14-2022 వరకు విద్య యాత్రను తెలంగాణలో కొనసాగించడానికి సమాజ్ వాదీ పార్టీ నడుంబిగించింది అన్నారు. ఈ సందర్భంగా జిన్నారం మండలం అధ్యక్షునిగా చింతా అనిల్ మహీంద్రాను పార్టీ కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు.

# మండల ప్రజా పరిషత్తులో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

**కొడిమ్యాల మార్చి 23 (ప్రజామంటలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు గౌరవ చొప్పదండి శాసనసభ్యుడు రవిశంకర్ అన్న సూచనల మేరకు తేదీ 23-03-2022రోజున ఉదయం 10.00 గంటలకు మెన్నెని స్వర్ణలత రాజనర్సింగరావు మండల పరిషత్ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో సభ్యులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంము నందు ప్రత్యేక సమావేశము జరిపి ఈ క్రింది అంశములను చర్చించి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించడమైనది. ఇట్టి సమావేశంలో కొడిమ్యాల మండలంలోని ఇరవై నాలుగు




గ్రామాల పరిధిలోని రైతుల యాసంగి మరియు వర్షాకాలంలో పండించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసనవేణి మహేష్, ఊటుకూరు మల్లారెడ్డి, సామల లక్ష్మణ్, డబ్బు జగన్మోహన్ రెడ్డి, చీకట్ల సింధు మహేష్, మేక మరియా రవి పాల్గొని ఎంపీడీవో పద్మజ కి తీర్మానం పత్రము అందించడం జరిగింది.



## క్రీడాకారులకు జెర్సీల బహుకరణ

**ఇబ్రహీంపట్నం మార్చి 23 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలంలోని ఏర్దడి గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి కెసిఆర్ కప్పు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా, బుధవారం పాల్గొన్న క్రీడాకారులకు టిఆర్ఎస్ ప్రచార కార్యదర్శి ఆర్.ఎం.పి, పి.ఎం.పి జిల్లా ప్రధాన కార్యదర్శి సొంత ఖర్చులతో క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. అనంతరం టాస్ వేసి క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా పెంట లింబాద్రి మాట్లాడుతూ.... ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు టిఆర్ఎస్ యువ నాయకులు కల్వకుంట సంజయ్ నాయకత్వంలో నిర్వహిస్తున్నటువంటి కెసిఆర్ కప్పు, మండల స్థాయి టోర్నమెంటులో అధిక సంఖ్యలో క్రికెట్ క్రీడాకారులు పాల్గొని టోర్నమెంట్ ను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అంతేకాకుండా ముఖ్యంగా యువకులు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు తప్పనిసరి అని అంతే కాకుండా స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా దొరికే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్కీల శ్రీనివాస్, అందుగుల నాగేష్, కానుగంటి సురేష్, గోడిసెల వెంకటేష్, భర్తీపూర్ సర్పంచ్ సంగం సాగర్, క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయ బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారి 43వ బ్రహ్మోత్సవ, కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను కోదండ రామాలయం ధరూర్ క్యాంప్ చైర్మన్ బ్రహ్మండబెరి నరేష్ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్లో కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక ను ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్, స్థానిక కౌన్సిలర్ వొద్ది శ్రీలత రామ్మోహన్ రావు, రామాలయ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

### భూమి రిజిస్ట్రేషన్ చేయకూడదని తహసీల్దార్‌కు వినతి



**రాయికల్ మార్చి 23 (ప్రజామంటలు):** రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామం అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు బుధవారం తహసీల్ధార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఇటిక్యాల గ్రామ శివారు లోని సర్వే నెంబర్లు 1952,1953,1955,1956 లో గల భూమి గత 60 సంవత్సరాల నుండి మాదిగ కుల సంఘం అధీనంలో ఉన్నది. ఇట్టి భూమిని కొందరు ఆక్రమించి దానిని వేరే వారికి రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తున్నారని అట్టి సర్వే నంబర్లు గల భూమి రిజిస్ట్రేషన్ కి వస్తే అట్టి రిజిస్ట్రేషన్ ను నిలిపివేయాలని వినతిపత్రం లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూమేష్, నారాయణ, నర్సయ్య, రాజాం, కొండయ్య, బుచ్చిరాజం, సంజీవ్ మరియు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాయికల్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు 4జి స్మార్ట్ ఫోన్ లు అందజేసిన రాయికల్ మండల ఎంపీపీ భూక్య సంధ్యారాణి సురేందర్ నాయక్. పాల్గొన్న మండల వైద్యాధికారి డా. పి. ప్రవీణ్ చంద్ర, సిహెచ్ఓ కె. ప్రమీల, హెచ్ఈవో శ్రీనివాస్ సూపర్వైజర్స్ టి. శ్రీధర్, బి. చంద్రకళ ఆశా కార్యకర్తలు.

## ప్రొసీడింగ్ పత్రాలను అందించిన జెడ్పిటిసి పాగాల



**చిల్పూర్ మార్చి 23 (ప్రజామంటలు):** హన్మకొండలోని జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాగాల సంపత్ రెడ్డి నివాసంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో చిల్పూర్ మండలంలోని దేశాయి తండా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులకు ప్రొసిడింగ్ పత్రాన్ని గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా రాజు, భూక్యా సుందర్, భూక్యా రవి, భూక్యా వెంకట్ నాయక్ లకు అందజేసి స్టేషన్ ఘణపూర్ హన్మకొండలోని జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ %ఁ% తెరాస జిల్లా అధ్యక్షులు శ్రీ పాగాల సంపత్ రెడ్డి నివాసంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో స్టేషన్ ఘణపూర్ మండలంలోని సముద్రల గుంటూర్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు పనులకు ప్రొసిడింగ్ పత్రాన్ని థామస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నర్సింగరావు లకు అందజేసారు.

# సాంస్కృతిక సారథి కళా ప్రదర్శనలు



జనగామ మార్చి 23 (ప్రజామంటలు): రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు పల్లె పల్లెన జనగామ జిల్లా కలెక్టర్ సారథ్యంలో లింగాల ఘణపురం మండలం కుందారం గ్రామంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధ్వర్యంలో సాంస్కృతిక సారథి కళాకారులు కళాప్రదర్శనలు ఇచ్చారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి, దళిత బంధు, మిషన్ భగీరథ లాంటి పథకాలపై అవగాహన కల్పించారు. కళాకారులు. జనగామ శంకర్, గట్ట గళ్ళ సంజీవ, భానోత్ గణేష్, కారుపోతుల సోమయ్య, బావం పల్లి చిరంజీవి, కేమిడి కనకరాజు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో నష్టపోయిన వ్యక్తిని ఆదుకోవాలి



**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** హైద్రాబాద్ లో బి.సి. ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేష్ ఐఏఎస్ ను కలిసి గత నెల రోజుల క్రితం కరీంనగర్ నాక చౌరస్తా యందు శ్రీ రామాంజనేయ దుగోడ మిషన్ టేకు కలప విద్యుత్ ప్రమాదం వల్ల కాలిపోయినందుకు కాలిపోయిన మిషనరీ మరియు కలప విలువ నలభై ఒక్క లక్ష 63 వేల రూపాయల ఇప్పించుట కొరకై అధికారులను కలిసి విశ్వ బ్రాహ్మణ విశ్వ కర్మ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో షాపు యజమాని వనపర్తి కుమార స్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు ఆచారి, రాష్ట్ర కోశాధికారి తంగళ్ళపల్లి శ్రీనివాస్ చారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి, అధికార ప్రతినిధి రుద్ర రోజు లక్ష్మీ నారాయణ చారి, ప్రచార కార్యదర్శి గుగ్గిల్ల సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెరాస నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం

**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** తెరాస పార్టీ కుటుంబ సభ్యులందరు తేదీ 24-03-2022 గురువారం ముఖ్యమంత్రి ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉదయం 10:00 గంటలకు జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ లో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం కలదు. కావున తెరాస పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఛైర్మెన్లు, ఎంపీపీ, జెడ్పీటిసి సభ్యులు, కౌన్సిలర్ లు, సర్పంచ్లు, యంపీటీసీలు, ఏఎంసి, పీఏసీఎస్, రైతు బంధు సమితి, ఆత్మ చైర్మేన్లు, డైరెక్టర్ లు , రైతు బంధు గ్రామ కన్వీనర్లు, సభ్యులు, ముఖ్య నాయకులు, అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఎమ్మెల్యే కోరారు.

## ఈనెల 25 న చలో హైదరాబాద్ కరపత్రాల విడుదల



**జన్నారం మార్చి 23 (ప్రజామంటలు):** జన్నారం మండల కేంద్రంలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర తెలంగాణ మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న చలో ఇందిరా పార్క్ హలో మాల చలో హైదరాబాద్ ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేయడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాల మహానాడు నాయకులు దాముక కరుణాకర్ మాట్లాడుతూ.... ఎస్సీ, ఎస్ టి, సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలు చేయాలని దళితుల అసైన్డ్ మరియు ఇతర భూములకు రక్షణ కల్పించాలని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అమలు చేయాలని జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్ 19 శాతం పెంచాలని అలాగే రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు మాల మహానాడు శ్రేణులు భారీగా తరలి రావాలి. మండల జిల్లా రాష్ట్ర నాయకులు కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు జిల్లా నాయకులు, జక్కుల సురేస్, దాముక కరుణాకర్, అక్కవత్తుల దేవయ్య సార్, భుమన్న స్వామీ, లక్ష్మీరాజం, మహిపాల్, నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**భీమదేవరపల్లి మార్చ్ 23 (ప్రజామంటలు):** మండలంలోని ప్రసిద్ధి గాంచిన కొత్తకొండలో సబ్ హెల్త్ సెంటర్ కొరకు హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వోడితేల సతీష్ కుమార్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాలే కాకుండా ప్రజలకు అవసరమయ్యే సబ్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ కు నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీఛైర్మన్ డా. సుధీర్ కుమార్, జడ్పీటీసీ వంగ రవి, ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్, తెరాస మండల అధ్యక్షులు మార్పాటి మహేందర్ రెడ్డి, సర్పంచ్ దూడల ప్రమీలా సంపత్, గుంటి ఓదేలు, ఎంపీటీసీ యాటపోలు రాజమణి శ్రీనివాస్, దార్న శ్రీనివాస్, ఎర్రోజు వినయ్, రజనాచారి, ఎంపీడీఓ లంకపల్లి భాస్కర్, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి, ఖిలాషాపురం గ్రామ వాస్తవ్యులు కావటి రాజయ్య కుమార్తె అనిత శివ కుమార్ యాదవ్ వివాహానికి హాజరైన జెడ్పీ చైర్మన్, తెరాస జిల్లా అధ్యక్షులు సంపత్ రెడ్డి. పాల్గొన్న జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు పోకుల శివ కుమార్, జిల్లా రైతు బంధు సభ్యులు రాంబాబు.

## తెరాస నాయకులు మాటలు వెనుకకు తీసుకోవాలి

**మోరపల్లి రమణారెడ్డి**




**కరీంనగర్ మార్చి 23 (ప్రజామంటలు):** టిఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ పట్ల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపెల్లి రమణారెడ్డి పలువురు నియోజకవర్గ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోరపెల్లి రమణా రెడ్డి మాట్లాడుతూ%ొా%. కవ్వంపల్లి సత్యనారాయణ ఒక పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నియోజకవర్గ ప్రజలకు పార్టీపరంగా, వైద్య పరంగా సేవలందిస్తున్నారు, అలాంటి నాయకున్ని రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కవ్వంపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని, టిఆర్ఎస్ నాయకులు కళ్ళు మూసుకుపోయి మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నియోజకవర్గంలో అధికార మదంతో ప్రభుత్వ భూముల కబ్జాలు చేస్తూ, ఇసుక మాఫియా నడుపుతూ సాంస్కృతిక మండలి చైర్మన్ గా ఉండి ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ లో డబ్బులు దండుకుంటున్నారు. వీటన్నింటిపై రసమయిని నిలదీయకుండా, ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగుతామంటున్న జి.వి. రామకృష్ణ రావు ముందు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే రసమయి బాలకిషన్ ను నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామని, ఎప్పటికప్పుడు రసమయి అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని, కాంగ్రెస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లేకుంటే నేడు మీరు ఎక్కడ ఉండేవారని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడం వల్లనే కెసిఆర్ నుండి మొదలు మీలాంటి గల్లి నాయకులకు అందరికీ ఈరోజు పదవులు వచ్చాయని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, చేసిన వ్యాఖ్యలపట్ల వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోలంపల్లి యం.పి.టి.సి. బండారి రమేష్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆశిక్ పాషా కాంగ్రెస్ మండల కాంగ్రెస్ నాయకులు గవ్వ రాజేందర్ రెడ్డి, మెరుగు మోహన్, చెన్నబోయిన రమేష్ పాల్గొన్నారు.

# 2025 వరకు టీబీ ముక్త్ భారత్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శర్మన్

### గాంధీ ఆసుపత్రిలో క్షయవ్యాధి నివారణ అవగాహన ర్యాలీ




**సికింద్రాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** రాబోవు 2025 వరకు ఇండియా నుంచి టీబీ వ్యాధిని పూర్తిగా రూపుమాపేందుకు ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎల్. శర్మన్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పూర్తి స్థాయిలో క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు, పల్మనాలజీ డిపార్ట్మెంట్ హెచ్వోడీ డా.కృష్ణమూర్తి, గాంధీ టీబీ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్. విజయ్ కుమార్, డా.రాములు, పీజీ, జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఎన్టీఈపీ స్టాఫ్ శ్రీదేవి, సుబ్బారావు, కవిత, జగత్ కుమార్, జలాల్, నటరాజు, తులసీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ములుకనూర్ సహకార సంఘ ఉపాధ్యక్షులుగా చీకట్ల రాజయ్య



**భీమదేవరపల్లి మార్చి 23 (ప్రజామంటలు):** ములుకనూర్ సహకార సంఘ ఉపాధ్యక్షులుగా మల్లారం గ్రామానికి చెందిన చీకట్ల రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుకనూర్ సహకార పరపతి సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఇటీవల 5 గురు డైరెక్టర్లు గెలుపొందగా వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉపాధ్యక్షులుగా చీకట్ల రాజయ్యను 20 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ%ొా%. సంఘ అభ్యున్నతికి, సభ్యుల సంక్షేమం కోసం అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తానని హామీ

## ఉర్దూ జూనియర్ లెక్చరర్ల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ మార్చి 23 (ప్రజామంటలు): మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ఔట్సోర్సింగ్ పద్ధతి లో ఉర్దూ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం నియామకానికి అర్హులైన వారు దరఖాస్తులను అందించాలని జిల్లా కలెక్టర్ శివలింగయ్య కోరారు. జనగామ జిల్లాలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ ఉర్దూ లెక్చరర్ గా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి బి.ఎడ్. అర్హత కలిగి 44 సంవత్సరములు వయసులో ఉన్నవారు బోధనలో మూడు సంవత్సరముల అనుభవము కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హతలు నియమ నిబంధనలకు సంబంధించిన వివరాలకు మైనారిటీ సంక్షేమ అధికారి సయ్యద్ ఇస్మాయిల్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం జనగామ వారిని సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటల లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రూమ్ నెంబర్ ఎఫ్- 25 లో గల మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఇతర వివరాలకు 799 335 7081, 9963 397958, 995 193 3034 నెంబర్ల లో సంప్రదించవచ్చునన్నారు.



ది కాశ్మీర్ ఫైల్స్ ప్రత్యేక షోను జనగామలో బుధవారం వీక్షించిన జనగామ జిల్లా బిజెపి శ్రేణులు. పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి, నాయకులు కెవిఎల్ఎన్ రెడ్డి, కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా

## హుస్నాబాద్ లో ఉగాది కవి, గాయక సమ్మేళనం



**హుస్నాబాద్ మార్చి 23 (ప్రజామంటలు):** ఉగాది పండుగను పురస్కరించుకొని ఏప్రిల్ 5 న, మంగళవారం సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి సౌజన్యం తో మరియు వాల్మీకి సోమన్న పోతన వేమన (వా.సో.పో.వే.) సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఉగాది కవి, గాయక సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి. శ్యాంప్రసాద్ లాల్ అడిషనల్ కలెక్టర్ కరీంనగర్, సభాధ్యక్షులుగా వేముల వేమన, చరణ్ సాయి దాసు, వ్యవస్థాపక అధ్యక్షులు (వా.సో.పో.వే.) మరియు విశిష్ట అతిథులుగా గోలి పద్మారెడ్డి, గాజోజు నాగభూషణం, ఉండ్రాళ్ళ రాజేశం, కందుకూరి అంజయ్య, నేర్నాల కిషోర్, కాస్పోజు సంజీవచారి, దాసరి శాంతకుమారి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొనాలని కార్యక్రమ నిర్వాహకులు రూపకర్త కళ్యెం లక్ష్మణ్ కోరారు.

ఈ కార్యక్రమానికి సంబందించిన కరపత్రమును కర్ణకంటి మంజుల, వేముల వేమన, శ్రీచరణ్ సాయిదాస్, వీరసోమయ్య, వలువోజు జగదీశ్వర్, కస్పోజు సంజీవ చారి, గజ్జెల వినోదలు విడుదల చేశారు.



## దొంగతనం ప్రయత్నం చేసి, పారిపోతూ ఇంటికి నిప్పు

రాయికల్ మార్చి 23 (ప్రజామంటలు): రాయికల్ పట్టణంలో మార్కండేయ నగర్ లో రాత్రి సమయంలో పైడిమర్రి శ్రీనివాస్ అనే వ్యక్తి అద్దె ఇంటికి నిప్పు పెట్టిన అంగతుడిని స్థానికులు గుర్తించారని విశ్వసనీయ సమాచారం. దొంగతనం ప్రయత్నం చేసిన వ్యక్తి పారిపోతూ శ్రీనివాస్ ఇంట్లో దొంగతనంకు యత్నించగా మేలుకున్న వారి ఎవ్వరు అని అరవడంతో తలుపుకు గొళ్ళెం పెట్టీ పెట్రోలు పోసి చంపే ప్రయత్నం చెయ్యగా మేలుకున్న బాధితులు వెనక డోర్ బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. రెక్కాడితే కానీ దొక్కడి పేద కుటుంబం వీరిది రోజు వారీగా ఊర్ల పొన్న తిరుగుతు బట్టలు అమ్ముకుని బ్రతికే కుటుంబం వారిది ఈ అగ్ని దాడిలో టివి, ఫోన్, అమ్మకానికి సిద్ధంగా ఉన్న బట్టలు దాదాపు వాటి విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుంది. తక్షణమే ప్రభుత్వ అధికారులు, పాలకులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## మద్యం మత్తులో కారు నడిపిన యువకుడు

### 9 ద్విచక్ర వాహనాలు ధ్వంసం



**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** జగిత్యాల నుండి కరీంనగర్ వైపు బుధవారం కారులో వెళ్తున్న మోహన్ అనే యువకుడు మద్యం మత్తులో కారును అతివేగంగా నడపడం తో అదుపు తప్పి రోడ్డు ప్రక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలపై కి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 9 ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఓ రెస్టారెంట్ ఎదుట పార్కింగ్ ప్లేస్ లో నిలిపి ఉంచిన వాహనాలపై కారు దూసుకెళ్లగా ఈ సంఘటన చోటు చేసుకుంది. జగిత్యాల నుండి కరీంనగర్ వైపు బుధవారం కారులో వెళ్తున్న మోహన్ అనే యువకుడు మద్యం మత్తులో కారును అతివేగంగా నడపడం తో అదుపు తప్పి రోడ్డు ప్రక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలపై కి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 9 ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఓ రెస్టారెంట్ ఎదుట పార్కింగ్ ప్లేస్ లో నిలిపి ఉంచిన వాహనాలపై కారు దూసుకెళ్లగా ఈ సంఘటన చోటు చేసుకుంది.

## మిషన్ కాంపౌండ్ ప్రాథమిక హాస్పటల్లో స్వచ్ఛభారత్



**జగిత్యాల మార్చి 23 (ప్రజామంటలు):** భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర పిలుపు మేరకు బీజేవైఎం జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో షహీద్ దివస్ సందర్భంగా మిషన్ కాంపౌండ్ లో ఉన్నటువంటి ప్రభుత్వ ప్రాథమిక హాస్పటల్లో స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్ రావడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ్ర రవితేజ మాట్లాడుతూ.... భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవ్ వారిని ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. యువత అంతా కూడా వారిని ఆదర్శంగా తీసుకొని దేశభక్తితో ముందుకు నడుచుకోవాలని ఉద్దేశించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు పవన్ సింగ్ గారు, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శిలు చుక్కల ప్రేమ్ సాగర్, బోదనపు వినీత్ ఉపాధ్యక్షుడు కుసరి మహేష్, బీజేవైఎం కోశాధికారి ముస్కాం సాయికిరణ్, కార్యవర్గ సభ్యుడు ఓరగంటి మధు, బూత్ అధ్యక్షులు ఆరుముళ్ళ రాజు, రాజేశం. దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు నక్క జీవన్, హరికృష్ణ, విజయ్, నరేందర్, రాజు తదితరులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. భారత్ మాతాకీ జై.. అని నినదించారు.

## సి.సి. రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**చిల్పూర్ మార్చి 23 (ప్రజామంటలు):** కొండాపూర్ గ్రామం ఎర్ర కుంట తండా లో ఎన్ ఆర్ జి ఎస్ నిధులు 5లక్షల రూపాయల తొ సిసి రోడ్డు పా్రరంబించిన సర్పంచ్ లొడెం రజిత రవీందర్ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి దిశగా టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం పి టి సి ఐలమ్మ ఎల్లయ్య ఉప సర్పంచ్ సంపత్ మరియు వార్డు సభ్యులు భూక్య బుజ్జమ్మ, వీరన్న, గాలి కనకయ్య , టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గాలి ప్రవీణ్ మరియు టిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపిటిసి భానోత్ కిమాని, గోల ప్రకాష్ పులి సంపత్, పపోతన, రాజబాబు, ఈట్ట బోయిన రవి, గుండెబోయిన రాజయ్య, కొండరాజు, మోతే నరసయ్య తదితరులు పాల్గొన్నారు.ద

## కుందారం హైస్కూల్ విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



**జనగామ మార్చి 23 (ప్రజామంటలు):** తెలంగాణ సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామంలోని హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్స్, పెన్నులు, పెన్సిల్, రబ్బర్, చెక్ మర్ అందజేశారు. తెలంగాణ సామాజిక చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు చిర్ర వీరస్వామి మాట్లాడుతూ.... అందరూ బాగా చదవాలి, అందరూ ఎదిగి, సమాజ సేవలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉద్యాన వన శాఖ జిల్లా అధికారి లత మాట్లాడుతూ.... విద్యార్థులు అందరూ 10/10 గ్రేడ్ తెచ్చుకోవాలన్నారు. తల్లి తండ్రులకు,ఊరికి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి, ఉపాధ్యాయ బృందం, లక్ష్యం యూత్ అధ్యక్షుడు శాడగొండ సామ్రాజ్, అంబెద్కర్ యూత్ అధ్యక్షుడు పాలమాకుల ఆనంద్, దళిత శక్తి ప్రోగ్రాం మండల అధ్యక్షుడు ఇనుముల ప్రశాంత్, యూత్ నాయకులు ఎం.డి.అస్లాం పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com